మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 214 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad




## వైద్యశాఖలో కొలువుల జాతర

- మరో 371 పోస్టులకు నోటిఫికేషన్ - 271 నర్సింగ్ ఆఫీసర్, 99 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ



హైదరాబాద్, (ప్రజా మంటలు):
నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం దసరా కానుక ప్రకటించింది. ఆరోగ్య శాఖలో మరో 371 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 271 నర్సింగ్ ఆఫీసర్, 99 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీకి సంబంధించి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల మిగతా 2లో..



## కులమతాలకు అతీతంగా అందరికీ విద్య

- విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు
- ప్రపంచంతో పోటీపడే విధంగా తీర్చిదిద్దే లక్ష్యం
- లక్ష్మీపురంలో గురుకులానికి శంకుస్థాపనలో భట్టి

ఖమ్మం (ప్రజా మంటలు):
కుల, మతాలకు అతీతంగా అందరినీ సమన్వయపరుచుకుంటూ ముందుకెళు_న్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అన్ని వర్గాల వారి కోసం విద్యా బుద్ధులు నేర్పేందుకు నాంది పలికామన్నారు. చదువు, వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. విద్యా విధానంలో మిగతా 2లో..

gata ప్రభుత్వ హయాంలో 5 వేల

## స్కూళ్లు మూసివేత

- పేదలను విద్యకు దూరం చేసేందుకే ఈ కుట్ర
- వారికి నాణ్యమైన విద్యను అందించాలన్నదే మా లక్ష్యం
- లక్షల కోట్లు అప్పులు చేసినా..టీచర్ల నియామకం చేపట్టలే
- పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు విస్మరించారు
- కొందుర్గులో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలకు సీఎం రేంవత్ రెడ్డి శంకుస్థాపన



రంగారెడ్డి (ప్రజా మంటలు):
తెలంగాణలో ఉన్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. వైద్య సదుపాయాలను మెరుగుపరిచి ఆరోగ్య తెలంగాణను ఆవిష్కరిస్తామన్నారు. గత కెసిఆర్ ప్రభుత్వం లక్షల కోట్లు అప్పు చేయడమే గాకుండా విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని అన్నారు. దాదాపు ఐదువేల పాఠశాలలను మూసేసిందని అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కొందుర్గులో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి సీఎం రేంవత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఒక్కో స్కూల్ భవనాన్ని రూ.150 కోట్లతో 25 ఎకరాల్లో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కొందుర్గులో ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. చదువుకున్న విద్యార్థుల కొలువుల గురించి కేసీఆర్ ఎప్పుడైనా ఆలోచించారా? అని ప్రశ్నించారు. పేదలంతా గొర్రెలు, బర్రెలు, చేపలు పెంచుకుంటూ బతకాలని కేసీఆర్ భావించారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అందరి పార్టీ, ఇది పేదల ప్రభుత్వం. లోక్‌సభ ఎన్నికల్లో భారాసకు సున్నా సీట్లు వచ్చినా.. వారి ఆలోచనా విధానం మారలేదు. కేసీఆర్ గురుకుల పాఠశాలలకు ఎక్కడా సరైన భవనాలు నిర్మించలేదు. పేద విద్యార్థులు, చదువుకునే బడులు, హాస్టళ్లు, గురుకుల పాఠశాలలను పట్టించుకోలేదు. భారాసకు మాత్రం 33 జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు నిర్మించుకున్నారు. చదువుకునే విద్యార్థులను కూడా కేసీఆర్ కులాల వారీగా విభజించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ వేర్వేరుగా గురుకులాలు పెట్టారు. గత ప్రభుత్వం 5వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసింది. దీంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారు. కొన్నేళ్లుగా బదిలీలు, పదోన్నతులు లేకపోవడంతో టీచర్లలో అసహనం ఏర్పడింది. ఈ ప్రభుత్వం 21వేల మంది టీచర్లకు పదోన్నతులు ఇచ్చి ఒక నమ్మకం కలిగించిందని సీఎం వివరించారు. ఇదిలావుంటే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణాన్ని ఆర్ఎస్ ప్రవీణ్ ఎందుకు తప్పుపడుతున్నారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లో చేరగానే ఆర్ఎస్ ప్రవీణ్ ఆలోచన మిగతా 2లో..



## యుద్ధంతో కాదు..దౌత్యంతోనే సమస్యల పరిష్కారం సాధ్యం

- అంతర్జాతీయ ఉద్రిక్తతలపై ఈస్ట్ ఆసియా సమ్మిట్‌లో మోదీ వ్యాఖ్యలు
- ఐక్యరాజ్యసమితి చట్టాలకు లోబడి సముద్ర కార్యకలాపాలు జరగాలని వ్యాఖ్య
- మోదీతో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చర్చలు

వియాంటియాన్ (ప్రజా మంటలు):
ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణలు గ్లోబల్ సౌత్ దేశాలపై అత్యంత ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయని మోదీ పేర్కొన్నారు. లావోస్‌లోని 19వ ఈస్ట్ ఆసియా సమ్మిట్‌లో ఆయన ప్రసంగించారు. 'నేను బుద్ధుడి బోధనలను అనుసరించే దేశం నుంచి వచ్చాను. ఇది యుద్ధాల యుగం కాదు. యుద్ధంతో సమస్యలకు పరిష్కారాలు లభించవు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణలు గ్లోబల్ సౌత్ (వర్ధమాన దేశాల) దేశాలపై అత్యంత ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. మిగతా 2లో..



## డిఎస్పీగా క్రికెట్ సిరాజ్

నియామక పత్రం అందచేసిన డిజిపి

హైదరాబాద్, (ప్రజా మంటలు):
టీమిండియా క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు ఇంటి స్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఆగస్టు నెలలో జూబ్లీహిల్స్ మిగతా 2లో..

## కులగణనపై ఉత్తర్వులు జారీ

జీవో విడుదల

హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణలో సమగ్ర కులగణనపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేయనున్నట్లు జీవోలో పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వే చేయనున్నట్లు ఉత్తర్వుల్లో సీఎస్ శాంతికుమారి వెల్లడించారు. సర్వే బాధ్యత ప్రణాళికశాఖకు అప్పగించారు. 60 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

పాఠకులకు,ప్రకటన కర్తలకు, ఏజెంట్లకు శ్రేయోభిలాషులకు ప్రజా మంటలు విజయదశమి శుభాకాంక్షలు



**సెలవు**

ప్రజా మంటలు కార్యాలయానికి శనివారం సెలవు ఆదివారం పత్రిక వెలువడదు పునర్దర్శనం సోమవారం

ఎడిటర్

### పొలిట్రిక్స్

ఐ.ఏ. హబ్బులంట
కంప్యూటర్ పనులకు
సాఫ్ట్వేర్లు వెడతారా
సాఫ్టుగా ఇళ్లకు ?

మనిషికంటే మేలంట
మానవ పనికి రోబోట్లు ,
తేడావస్తే లెక్కలకు
పడవా మరి తూట్లు ??!

- న్యాలకంటి నారాయణ
9346200066

## బీరుట్‌పై బాంబుల వర్షం

- ఇజ్రాయెల్ వైమానిక దాడి..
- 22 మంది మృతి



బీరూట్ (ప్రజా మంటలు):
ఇజ్రాయెల్– లెబనాన్‌ల మధ్య యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. తాజాగా ఇజ్రాయెల్‌లో లెబనాన్‌లోని బీరుట్‌పై వైమానిక దాడులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో 22 మంది మృతి చెందారు. 'లెబనాన్ రాజధాని బీరుట్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో 22 మంది మృతిచెందగా.. 117 మంది గాయపడ్డారు' అని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది.ఇదిలాఉండగా.. యూఎన్ శాంతి పరిరక్షణ కార్యాలయంపై ఇజ్రాయెల్ దళాలు కాల్పులు జరిపినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు గాయపడినట్లు తెలుస్తుంది. యూఎన్ శాంతి పరిరక్షణ కార్యాలయంపై ఇజ్రాయెల్ దళాలు కాల్పులు జరపడాన్ని ఇటలీ రక్షణమంత్రి గైడో క్రోసెట్టో ఖండించారు. దీన్ని యుద్ధనేరంగా పరిగణిస్తామన్నారు. ఈ దాడులపై వాషింగ్టన్ సైతం స్పందించింది. హెజ్‌బొల్లా సౌకర్యాలను లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేసే సమయంలో యూఎన్ శాంతి పరిరక్షకుల భద్రతకు ముప్పు వాటిల్లకుండా ఉండటం కష్టమని పేర్కొంది. ఇక, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో యూఎన్ పరిరక్షకులు సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని యూఎన్ సూచించింది.

## ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు

- ప్రభుత్వంజీవో జారీ



హైదరాబాద్, (ప్రజా మంటలు):
ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుపై తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం జీవో జారీ చేసింది. పంచాయతీ, మున్సిపల్, వార్డు స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గ్రామస్థాయిలో సర్పంచి లేదా ప్రత్యేక అధికారి, కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ ఛైర్మన్‌గా మున్సిపాలిటీ స్థాయిలో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. పంచాయతీ కార్యదర్శి లేదా వార్డు ఆఫీసర్ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ కన్వీనర్‌గా ఉంటారని జీవోలో ప్రభుత్వం పేర్కొంది. ఇద్దరు ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు, ముగ్గురు స్థానికులు కమిటీలో సభ్యులుగా ఉంటారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ కొనసాగనున్న ఈ కమిటీలు.. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తాయి. శనివారం నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. కమిటీల కోసం పేర్లు పంపాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం ఆదేశించింది.

## ప్రజా నాడి




## ఎస్సీ వర్గీకరణకు ముందడుగు

- జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ నియామకం



హైదరాబాద్, (ప్రజా మంటలు):
రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు సంబంధించి.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. హైకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ షమీమ్ అక్తర్‌ను కమిషన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. 60 రోజుల్లో నివేదిక సమర్పించాలని కమిషన్‌కు ప్రభుత్వం సూచించింది. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ కులాల వర్గీకరణ అమలుకు నియమించిన ఏకసభ్య కమిషన్ 60 రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని, ఆ తర్వాతే ఉద్యోగ నియామకాలకు సంబంధించి కొత్త నోటిఫికేషన్లు వేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉపకులాల వారీగా ఎస్సీల వెనుకబాటుతనాన్ని కమిషన్ అధ్యయనం చేయనుంది. ఎస్సీ వర్గీకరణ కోసం 2011 జనాభా లెకలను పరిగణనలోకి తీసుకొని, ఏకసభ్య కమిషన్ 60 రోజుల్లో నివేదిక సమర్పించాలని గడువు నిర్దేశిరచారు. కమిషన్‌కు అవసరమైన సమాచారాన్ని అన్ని విభాగాల నుంచి అందేలా చూడాలని సీఎస్‌కు సూచించారు. మంత్రివర్గ ఉప సంఘానికి అందిన వినతులపైనా సమావేశంలో చర్చించడంతో పాటు, వాటన్నింటినీ ఏకసభ్య కమిషన్‌కు అందించాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయి నుంచి విజ్ఞప్తులు, ఫిర్యాదుల స్వీకరణకు ఉమ్మడి పది జిల్లాల్లో ఒకోరోజు పర్యటించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు.

## రూపాయి.. మరింత కిందికి

- జీవనకాల కనిష్ఠ స్థాయికి పతనం



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
దేశీయ కరెన్సీ రూపాయి విలువ జీవనకాల కనిష్ఠ స్థాయికి చేరింది. డాలరుతో రూపాయి మారకం విలువ శుక్రవారం తొలిసారి 84 స్థాయికి చేరింది.పెరుగుతున్న క్రూడాయిల్ ధరలు, ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ మదుపరులు తమ నిధులు తరలిస్తుండటం రూపాయి విలువపై ఒత్తిడి పెరుగుతోంది. దీంతో నేడు ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి అయిన 84.05 స్థాయికి చేరింది.పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ముడి చమురు ధరలు గరిష్ఠ స్థాయికి చేరాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70 డాలర్ల స్థాయి నుంచి ఇటీవల కాలంలో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

గత ప్రభుత్వ హయాంలో 5 వేల

# స్కూళ్లు మూసివేత

విధానం మారిందని
రేవంత్ అన్నారు. ఎస్సీ, ఎస్టీలు ఇంకా బానిసలుగానే బతకాలని భావిస్తున్నారా అని సీఎం నిలదీశారు. పదేండ్లలో బర్రెలు, గొర్రెలు ఇచ్చాడే తప్ప మంచి చదువు ఇచ్చారా అని సీఎం ప్రశ్నించారు. విద్యా వ్యవస్థలో మార్పులపై ఎంతో ఆలోచించామని, నిపుణులు, మేధావులతో ఎంతో చర్చించానని సీఎం చెప్పారు. మేధావులతో చర్చించాకే ఈ స్కూళ్ల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందిస్తామని, విద్యా ప్రమాణాలు పెంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 5 వేల ప్రభుత్వ స్కూళ్లను మూసివేసిందని, పేదలను విద్యకు దూరం చేయాలని బీఆర్ఎస్ కుట్ర పన్నిందని సీఎం ఆరోపించారు. ఎలాంటి వివాదం లేకుండా టీచర్ల బదిలీలు చేపట్టామని, అర్హులైన టీచర్లందరికీ ప్రమోషన్లు, బదిలీలు చేశామని డీఎస్సీ నియామకాలను గుర్తు చేశారు. విద్యార్థుల భవిష్యత్ కోసమే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్‌ను తీసుకొచ్చినట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. బుర్రా వెంకటేశం లాంటి వ్యక్తులు రెసిడెన్షియల్ స్కూళ్లలోనే చదివారని గుర్తుచేశారు. రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేసిన కేసీఆర్ పాఠశాలలను బాగు చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. పదేండ్లలో కేసీఆర్ రూ.7 లక్షల కోట్లు అప్పు చేశారని, రెసిడెన్షియల్ స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించాలనే కనీస ఆలోచన చేయలేదని కేసీఆర్ పాలనపై సీఎం రేవంత్ మండిపడ్డారు. రేవంత్ సర్కార్ 28 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. స్థానిక ఎమ్మెల్యే తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కులమతాలకు అతీతంగా అందరికీ విద్య

విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీపడే విధంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలోని లక్ష్మీపురంలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలకు శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఈ ఏడాది సమీకృత గురుకులాలకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. సంకల్పం, చిత్తశుద్ధి ఉంటే సాధ్యం కానిదేది లేదు. వచ్చే విద్యా సంవత్సరానికి గురుకుల భవనాలు పూర్తి కావాలి. వీటిలో సకల సౌకర్యాలు పొందుపరుస్తున్నాం. ప్రభుత్వ విద్యావిధానం నిర్వీర్యం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. విద్యాసంస్థల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు. పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యతతో కూడిన విద్యను అందించాలన్న లక్ష్యంతో సమీకృత గురుకులాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. కులమతాలకు అతీతంగా అందరినీ ఒక్కటి చేయటమే ప్రభుత్వ లక్ష్యమని.. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో ప్రజల్లో మత సామరస్యం పెరుగుతుందని అన్నారు. కొందరు ప్రభుత్వాన్ని అవమానించటమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో విద్యార్థులకు భోదన అందిస్తామని.. సకల సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తామని అన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం కోసం ఈ ఏడాదికి రూ.5వేల కోట్లు కేటాయించామని అన్నారు భట్టి విక్రమార్క. మొదటి దశలో 28 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకి శంఖుస్థాపన చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం కులం ,మతం పేరు మీద గురుకులాలు ఏర్పాటు చేశారని.. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ద్వారా అందరూ కలిసి ఒక్క దగ్గర చదువుకుంటారని అన్నారు. రాష్ట్ర ,దేశ నిర్మాణానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ళు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ఇప్పటికే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా 25 వేల పాఠశాలలో రూ. 1100 కోట్లతో మౌలిక వసతులు కల్పించామని అన్నారు.

## వైద్యశాఖలో కొలువుల జాతర

చేసింది. రేవంత్ సర్కార్ ఇప్పటికే 7,300 పోస్టులను భర్తీ చేసింది. మరో 6,500 పోస్టుల భర్తీ పక్రియ కొనసాగుతోంది. తాజాగా మరో 272 నర్సింగ్ ఆఫీసర్(స్టాఫ్ నర్స్), 99 ఫార్మసిస్ట్(గ్రేడ్ 2) పోస్టుల భర్తీ చేపట్టేందుకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించి శుక్రవారం నాడు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. తాజాగా ప్రకటనతో మొత్తం పోస్టుల సంఖ్య 732కు పెరిగింది. అక్టోబర్ 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తు చేసేందుకు గడువు ఇచ్చింది. నవంబర్ 30వ తేదీన రాత పరీక్ష నిర్వహించ నున్నారు. గత నెలలో విడుదల చేసిన ఫార్మసిస్ట్, నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌కి అనుబంధంగా ఈ నోటిఫికేషన్ విడుదల చేసినట్టు బోర్డు తెలిపింది. గత నెలలో 2,050 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు ఇచ్చిన నోటిఫికేషన్‌కు ఇప్పుడు అదనంగా మరో 272 పోస్టులను జతచేసింది. దీనితో మొత్తం భర్తీ చేయనున్న నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు 2,322కి చేరాయి. ఈ నెల 14లోగా నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాని బోర్డు సూచించింది. నవంబర్ 17న కంప్యూటర్ విధానంలో పరీక్ష నిర్వహించ నున్నట్లు పేర్కొంది. అదేవిధంగా గతంలో ప్రకటించిన 633 ఫార్మసిస్ట్ పోస్టులకు అదనంగా మరో 99 పోస్టులను కలుపుతూ తాజాగా మరో నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో మొత్తం ఫార్మసిస్ట్ పోస్టుల సంఖ్య 732కి చేరింది. ఫార్మసిస్ట్ పోస్టులకు సంబంధించి ఈ నెల 21 వరకు దరఖాస్తులు స్వీకరించి నవంబర్ 30న పరీక్ష నిర్వహిస్తామని బోర్డు ప్రకటించింది.

## డిఎస్పీగా క్రికెట్ సిరాజ్

### నియామక పత్రం అందచేసిన డిజిపి



రోడ్ నంబర్ 78లో 600 చదరపు గజాల స్థలాన్ని సిరాజ్‌కు కేటాయిస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా సిరాజ్‌కు డీఎస్పీ పోస్టు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ జితేందర్ సిరాజ్‌కు డీఎస్పీ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖకు సిరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ క్రికెట్ భారత దేశానికి, మన తెలంగాణకు గొప్ప పేరు, గౌరవాన్ని తెచ్చాడంటూ మొహమ్మద్ సిరాజ్‌ను సీఎం అభినందించారు. టీ20 వరల్డ్ కప్‌ను గెలిచిన అనంతరం హైదరాబాద్‌కు చేరిన సిరాజ్ మంగళవారం ఉదయం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సిరాజ్‌ను సీఎం ఘనంగా సన్మానించారు. సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్‌లో తన అద్భుతమైన ప్రతిభను ప్రదర్శిస్తున్నాడని, అందుకే ఈ రోజు అత్యున్నత స్థాయి క్రికెటర్లలో ఒకడిగా పేరు సంపాధించాడని సీఎం ప్రశంసించారు. భారత ప్లేయర్‌గా ఏడేండ్లుగా సేవలు అందిస్తుండటమేకాక, ఐసీసీ టీ20 వరల్డ్ కప్ టీమిండియా గెలుపు బృందంలో సిరాజ్ ఉన్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో అడుగుపెట్టిన సిరాజ్‌కు హైదరాబాద్‌లో క్రికెట్ అభిమానులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సిరాజ్‌ను సన్మానించింది.

## యుద్ధంతో కాదు..దౌత్యంతోనే సమస్యల పరిష్కారం సాధ్యం

ప్రపంచ శాంతిభద్రతకు ఉగ్రవాదం సైతం తీవ్రమైన సవాలుగా మారింది. దీన్ని ఎదుర్కొనేందుకు మానవత్వంపై విశ్వాసమున్న శక్తులన్నీ కలసికట్టుగా పనిచేయాలి. అదేవిధంగా సైబర్, సముద్ర, అంతరిక్ష రంగాలలో పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకోవాలి. సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత, అంతర్జాతీయ చట్టాలను అందరూ గౌరవించాలి. సమస్యల పరిష్కారానికి చర్చలకు, దౌత్యానికి ప్రాధాన్యమివ్వాలి. యురేషియా, పశ్చిమాసియాల్లో శాంతి స్థిరత్వం పునరుద్ధరించాలి' అని మోదీ పేర్కొన్నారు.ఐక్యరాజ్యసమితి చట్టాలకు లోబడి సముద్ర కార్యకలాపాలు జరగాలి యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ది లా ఆఫ్ ది సీ(యూఎన్‌సీఎల్ఓఎస్)కు లోబడి సముద్ర కార్యకలాపాలను నిర్వహించాలని తాము విశ్వసిస్తున్నట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. నావిగేషన్, ఎయిర్‌స్పేస్ స్వేచ్ఛను నిర్ధరించడం అవసరమన్నారు. దక్షిణ చైనా సముద్రతీరంలో శాంతిభద్రతలను, ఇండో- పసిఫిక్ ప్రాంతాల ప్రయోజనాలను కాపాడాలని ఈసందర్భంగా మోదీ కోరారు. అనంతరం ఇటీవల వియత్నాంలో యాగి తుపాను కారణంగా మరణించినవారికి మోదీ సంతాపం తెలిపారు.

మోదీతో చర్చలు జరిపిన కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో

ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ హస్తం ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన వ్యాఖ్యలతో ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న విషయం తెలిసిందే.ఈ క్రమంలో ప్రధాని మోదీతో భేటీ అయినట్లు జస్టిన్ ట్రూడో వెల్లడించారు. లావోస్‌లో జరుగుతోన్న భారత్‌-ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా మోదీతో చర్చలు జరిపారు. తదుపరి చేయాల్సిన పనులు ఉన్నాయని మెదీతో ట్రూడో చెప్పినట్లు కెనడా మీడియా వెల్లడించింది."భారత్‌-ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా మోదీతో సమావేశమై పలు అంశాలపై చర్చించా. మనం తదుపరి చేయాల్సిన పనులు ఉన్నాయని చెప్పా. వివరాల్లోకి వెళ్లను కానీ.. నేను ఎప్పుడూ చెబుతున్నట్లుగా కెనడియన్ల భద్రత, చట్టబద్ధపాలనే మా ప్రభుత్వ బాధ్యతలు. వాటిపైనే దృష్టి సారించా" అని ట్రూడో పేర్కొన్నారు. నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి ప్రభుత్వం ఏర్పడిన సందర్భంలో మాట్లాడిన ట్రూడో.. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంతో తాము చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పిన నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

## రూపాయి.. మరింత కిందికి

దాదాపు 10 శాతం మేర పెరిగింది. దీనికి తోడు నిన్న అమెరికాలో వెలువడిన సీపీఐ డేటా కూడా మరో కారణంగా నిలిచింది. ఆశించిన స్థాయి కంటే అధికంగా నమోదు అవ్వడంతో ఫెడ్ వడ్డీ రేట్ల కోతపై నీలినీడలు కమ్ముకొన్నాయి. డిసెంబర్ నెలలో మరో 25 లేదా 50 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ కోత ఉండొచ్చన్న అంచనాలు క్షీణించాయి. దీనికి తోడు గడిచిన కొన్ని రోజులుగా ఈక్విటీ మార్కెట్‌లో విదేశీ మదుపర్లు విక్రేతలుగా నిలుస్తుండడమూ మరో కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## నిరవధిక నిరాహార దీక్షను కొనసాగిస్తున్న కోల్‌కతా వైద్యులు..

### - ఒకరి పరిస్థితి విషమం

కోల్‌కతా (ప్రజా మంటలు):
పశ్చిమ బెంగాల్‌లోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆసుపత్రిలో హత్యాచార ఘటన వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ..జూనియర్ వైద్యులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష శుక్రవారంతో ఆరో రోజుకు చేరుకొంది. కాగా ఈ దీక్షలో పాల్గొన్న వైద్యుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆసుపత్రికి చెందిన వైద్యాధికారులు పేర్కొన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..కొందరు జూనియర్ వైద్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా అక్టోబర్ 5 సాయంత్రం నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. వారిలో ఒకరైన అనికేత్ మహతో(ంనితిఎవబి ఓజీప్త్రజీబినీ) ఆరోగ్య పరిస్థితి క్రమంగా క్షీణిస్తూ వచ్చింది. దీంతో గురువారం రాత్రి అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా ప్రస్తుతం ఆ వైద్యుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. అతడి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించడానికి ఐదుగురు సభ్యులతో కూడిన మెడికల్ బోర్డును ఏర్పాటుచేశామన్నారు.ఇక్కడే నిరాహార దీక్షలో పాల్గొన్న మరో ఆరుగురు వైద్యుల ఆరోగ్యం కూడా క్షీణిస్తున్నట్లు జూనియర్ వైద్యులు పేర్కొన్నారు. వారికి వెంటనే వైద్యం అందించడానికి దీక్ష ప్రాంతంలో ఐసీయూ అంబులెన్స్, ఇతర వైద్య పరికరాలను ఏర్పాటుచేశామన్నారు. తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పరిష్కరించేవరకు నిరాహార దీక్ష కొనసాగుతుందని వారు పునరుద్ఘాటించారు. ఈ దీక్షలో పాల్గొన్న వైద్యుల్లో ఎవరికి ఏం జరిగినా దానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అలాగే నార్త్ బెంగాల్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మరో ఇద్దరు జూనియర్ వైద్యులు కూడా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లుగా అక్కడి వైద్యులు తెలిపారు. జూనియర్ వైద్యుల ఆరోగ్య పరిస్థితిపై సీనియర్ వైద్యులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. "ఈ యువ వైద్యులే మన భవిష్యత్తు. వీరు న్యాయం కోసం నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తోంది. పరిస్థితి చేయి దాటేలోపే అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలి" అని ఓ సీనియర్ డాక్టర్ బెంగాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కోల్‌కతాలోని ఆర్జీకర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఆగస్టు 9న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని వైద్య విద్యార్థులు పెద్దఎత్తున నిరసనలు కొనసాగించారు. సీఎం మమతా బెనర్జీ తమ డిమాండ్లను నెరవేర్చేందుకు హామీ ఇవ్వడంతో.. 42 రోజుల పాటు కొనసాగిన నిరసనలు విరమించి గత నెల 21న పాక్షికంగా విధుల్లో చేరారు. అయితే ప్రభుత్వం నుంచి సానుకూల చర్యలు లేకపోవడంతో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు.



## టాటా ట్రస్ట్స్ చైర్మన్‌గా నోయల్ టాటా

### - బోర్డు ఏకగ్రీవ నిర్ణయం

ముంబై (ప్రజా మంటలు):
టాటా ట్రస్ట్స్ చైర్మన్‌గా నోయల్ టాటా నియమితులయ్యారు. రతన్ టాటా తుదిశ్వాస విడిచిన నేపథ్యంలో ఆయన వారసుడిగా నోయల్ టాటాను ఎంపిక చేస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. నోయల్ రతన్ టాటాకు వరసకు సోదరుడు అవుతారు. సవతి తల్లి సిమోన్ టాటా కుమారుడు. ఆయన ఇప్పటికే టాటా గ్రూపులోని పలు కంపెనీల్లో వివిధ కీలక హోదాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ట్రెంట్, వోల్టాస్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్, టాటా ఇంటర్నేషనల్ కంపెనీలకు ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. టాటా స్టీల్, టైటాన్‌కు వైస్ ఛైర్మన్‌గానూ ఉన్నారు. శ్రీ రతన్ టాటా ట్రస్ట్ బోర్డులోనూ నోయల్ సభ్యుడిగా ఉన్నారు. టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్‌లో టాటా ట్రస్ట్స్‌కే అత్యధికంగా 66శాతం వాటా ఉంది. అందువల్ల టాటా టస్ట్÷-సక్రు ఛైర్మన్ హోదాలో ఉన్న వ్యక్తి.. గ్రూపు కంపెనీల కార్యకలాపాలు, వృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషిస్తారు. ఇప్పటివరకు టాటా ట్రస్ట్స్ ఛైర్మన్‌గా రతన్ టాటా ఉన్నారు. ఆయన మరణంతో టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ పదవి ఖాళీ అయ్యింది. ఇప్పుడు ఈ బాధ్యతలను నోయల్ టాటాకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ పదవి విషయంలో తొలుత వేర్వేరు పేర్లు వినిపించిన్పటికీ.. నోయల్ టాటాకే పగ్గాలు అప్పగించడం విశేషం. 1991లో రతన్ టాటాకు టాటా గ్రూప్ బాధ్యతలు అప్పగించారు. అప్పుడే ఆయన టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ పదవి చేపట్టారు. టాటా గ్రూప్‌లోని రిటైల్ కంపెనీ ట్రెంట్, టాటా ఇంటర్నేషనల్ లిమిటెడ్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్‌కు చైర్మన్‌గా / టాటా స్టీల్, టైటన్‌లకు వైస్ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ట్రెంట్ హయాంలో సాధించిన విజయాలు సర్వత్రా ప్రశంసలు అందుకున్నాయి. ట్రెంట్ మార్కెట్ క్యాప్ రూ.2.93 లక్షల కోట్లకు చేరుకుంది. నోయెల్ టాటా ఆగస్టు 2010 నుంచి నవంబర్ 2021 వరకు టాటా ఇంటర్నేషనల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా ఉన్నారు. ఆయన పదవీ కాలంలో కంపెనీ టర్నోవర్ 500 మిలియన్ డాలర్ల నుంచి 3 బిలియన్ డాలర్లకు పెరిగింది.

## సర్కారు తొందరపాటు నిర్ణయాలతో పేదల బతుకులు ఆగం

**- మూసీలో ఉన్నవారంతా పేదలే - వారికి అండగా బిజెపి ఉంటుంది**
**- 370 ఆర్టికల్ ముగిసిన చరిత్ర - మీడియాతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

హైదరాబాద్ (ప్రజా మంటలు):
మూసీ పరివాహక ప్రాంతాల్లో పేదోళ్ల ఇళ్లు కూల్చడాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి మరోసారి ఖండించారు. వారికి బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు ఎంతో కష్టపడి చిన్నచిన్న స్థలాలు కొనుక్కున్నారని, వారికి ప్రభుత్వమే అన్నీ అనుమతులు ఇచ్చి ఇప్పుడు కూలుస్తామని చెప్పడం దారుణమని ఆయన అన్నారు. కూల్చివేతలు అంత ఈజీ కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే స్వయంగా మూసీ ప్రాంతంలో పర్యటించి ప్రజలను ఒప్పించాలని డిమాండ్ చేశారు. మూసీ రిటర్నింగ్ వాల్ నిర్మించి కూడా సుందరీకరణ చేయెచ్చని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అన్నీ డ్రైనేజీలు మూసీలోనే కలుస్తున్నాయని, కనీసం శుద్ధి జరగకుండా నేరుగా నదిలోనే మురుగునీరు కలుస్తోందని ఆయన చెప్పారు. గంగా నదిపై కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ఖర్చుతో శుద్ధి చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మూసీ సుందరీకరణకు రూ.1.50లక్షల కోట్లు అవసరం లేదని స్పష్టం చేశారు. రేస్ కోర్స్ స్థలం అమ్మేసి మరీ సుందరీకరణ చేయడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ఎ÷-లాన్ లేకుండా ఇళ్లు కూల్చివేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. సీఎం దుందుడుకుగా వ్యవహరిస్తానంటే కుదరదని కేంద మంత్రి హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇలాగే ప్రజలపై బెదిరింపులకు పాల్పడిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాకు గవర్నర్ చట్టబద్ధత కల్పించడం సాధారణ పక్రియ అని, బాధితులు ఎవరూ భయపడొద్దని చెప్పారు. మూసీ బాధితుల కోసం బీజేపీ పోరాటం చేస్తోందని ఆయన మరోసారి చెప్పుకొచ్చారు. ప్రజలు బలహీనులు కాదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైడ్రా అంటే భూతం కాదని, గతంలోనూ అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం కూల్చేదని ఆయన చెప్పారు. అయితే ప్రస్తుతం దాని పేరును మార్చారని, అదే హైడ్రా అని చెప్పారు. హైడ్రా ముందుగా మూసీ నదిలో ఉన్న బస్ డిపో, మెట్రో పిల్లర్స్‌ను కూల్చాలని కేంద్ర మంత్రి డిమాండ్ చేశారు. వాటిని కూల్చకుండా ముందుగా పేదవారి ఇళ్లు ఎలా పడకొడతారంటూ ఆయన ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలోకి వెళ్లి అభిప్రాయాలు తెలుసుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి రావాలని డిమాండ్ చేశారు. మూసీలో కలిసే మురుగునీరు ఏం చేస్తారో ముందు సమాధానం చెప్పాలని సీఎంను డిమాండ్ చేశారు. నగరంలోని అన్ని ప్రాంతాల మురుగు నీరు వచ్చి మూసీలోనే కలుస్తోందని తెలిపారు. దీనిపై సీఎం ముందుగా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు తనను సంప్రదించారని వస్తున్న వార్తలను కిషన్ రెడ్డి ఖండించారు. తనను ఇప్పటివరకూ ఎవరూ సంప్రదించలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మూసీ పరివాహక ప్రాంతాల్లో నిర్మాణాలు వెలిశాయని.. 40ఏళు ్లగా అక్కడ నివాసం ఉంటున్న వాళ్లకు రాష్ట్ర ప్రభుత్వమే అన్ని వసతులు కల్పించాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో కిషన్ రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ధనవంతులు ఎవరూ లేరు. పేద ప్రజల ఇళ్లను కూల్చేముందు వాళ్లతో చర్చించిన తర్వాతే ముందుకు వెళ్లాలి. డ్రైనేజీ వ్యవస్థ అంతా మూసీలోనే కలుస్తోంది.. దానికి ప్రత్యామ్నాయం లేకుండా మూసీ సుందరీకరణ ఎలా సాధ్యమవుతుంది? రూ.లక్షన్నర కోట్లతో సుందరీకరణ చేస్తామంటున్న ప్రభుత్వం.. అ నిధులను ఎక్కడి నుంచి సమీకరిస్తుంది? కూల్చివేతల విషయంలో హైడ్రా తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం తగదు. సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తే బ్యాంకు రుణాలు ఎవరు చెల్లిస్తారఅని కిషన్ రెడ్డి ప్రశ్నించారు.ఈ సందర్భంగా జమ్మూకాశ్మీర్ ఎన్నికలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 98శాతం హిందువుల ఓట్లు తమకే వచ్చాయని కిషన్ రెడ్డి చెప్పారు. కశ్మీరీ పండిట్లు మొత్తం తమకే ఓట్లు వేశారని చెప్పారు. ఆర్టికల్ 370రద్దు ఓ చరిత్ర అని, దాన్ని తిరిగి తీసికొని వచ్చే అవకాశమే లేదన్నారు. చిన్న ఘటనకూడా చోటు చేసుకోకుండా 60 శాతం ఓటింగ్ జరిగిందని ఆయన చెప్పారు. ఫేక్ నోట్లు నియంత్రించామని, టెర్రరిజాన్ని అరికట్టగలిగామని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఐఎస్ఐపై కఠిన చర్యల కారణంగానే ఇదంతా జరిగిందని కేంద్ర మంత్రి చెప్పారు. జార్ఖండ్‌లో జరిగే ఎన్నికల్లోనూ తామే గెలవబోతున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌ను ప్రపంచ దేశాల ముందు దోషిగా నిలబెట్టామని, చైనా ఆహారం, ఆయుధాలు పాకిస్థాన్‌కు ఇస్తోందని మండిపడ్డారు. కాశ్మీర్‌లో పాక్ ఆటలు ఇకపై సాగనివ్వమని కిషన్ రెడ్డి హెచ్చరించారు. అర్టికల్ 370 విషయంలో పునరాలోచన లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తేల్చి చెప్పారు. పదేళ్ల భాజపా పాలనలో భారతదేశం అంతర్జాతీయంగా బలపడుతోందన్నారు.



## జనగామ జిల్లా కేంద్రంలో ఘనంగా జిల్లా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు"..

### జనగామ ఉద్యమకారులపై కేసులను ఏంటనే ఎత్తివేయాలని డిమాండ్

జనగామ అక్టోబర్ 11 (ప్రజామంటలు) :
జనగామ జిల్లా 9వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనగామ జిల్లా జెఏసి కన్వీనర్ మంగళంపల్లి రాజు అధ్యక్షతన ఉద్యమ స్ఫూర్తి స్థూపం వద్ద జాతీయ జెండా ఎగురవేసి ఘనంగా జిల్లా ఆవిర్భావ వేడుకలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉద్యమకారులు, నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కవులు కళాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉద్యమకారులు మాట్లాడుతూ జిల్లా ఏర్పటు కోసం ఉద్యమకారులు ఎన్నో త్యాగాలు, నిర్బంధాలు ఎదుర్కుంటూ ఉద్యమం చేశారని, జిల్లా ఏర్పడితే జనగామ అభివృద్ధి చెంది ఇక్కడి యువత భవిష్యత్తు బాగుపడుతుందని జిల్లా సాధిస్తే ఇక్కడి నాయకులు జనగామ అభివృద్ధిని పట్టించుకోలేదని, జనగామ అంటేనే పోరాటం, జనగామ అంటేనే ధిక్కారం అని ఇక్కడ మెడికల్ కాలేజి, నర్సింగ్ కాలేజి కూడా జెఏసి పోరాటంతోనే సాదించుకుందని తెలిపారు. రాబోవు కాలంలో జనగామ అభివృద్ధి కోసం జనగామ జెఏసి ఆద్వర్యంలో పెద్ద పోరాటం చేస్తుందని ప్రకటించారు. ఈ కార్య క్రమంలో జెఏసి కన్వీనర్ మంగళంపల్లి రాజు, టీఆర్ఎస్ నాయకులు ధర్మపురి శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి, బూడిద గోపి, చరిత్ర పరిశోధకులు రెడ్డి రత్నాకర్ రెడ్డి, జరసం కవులు జి. కృష్ణ, పెట్లోజు సోమేశ్వరాచారి, కాంగ్రెస్ నాయకులు జక్కుల వేణు మాధవ్, టిడిపి నాయకులు బైరు బాబు, ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర నాయకులు రాగల్ల ఉపేం దర్, ఎం.ఎస్.పి జిల్లా కార్యదర్శి కిషోర్, జెఏసి నాయకులు తుంగ కౌశిక్, అబ్బాస్, మీసా ల వెంకన్న, ఆసర్ల సుభాష్, ప్రభాకర్, యేతెందర్ స్వామి, బోట్ల సాయి, నోముల శ్రావణ్, జోగు ప్రకాష్, రంగు ప్రవీణ్, జయాల అరుణ్, సన్నీ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అష్టలక్ష్మి ఆలయంలో కొనసాగుతున్న దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు

జగిత్యాల అక్టోబర్ 11 (ప్రజా మంటలు)



స్థానిక బై పాస్ రోడ్డు సమీపం లోని శ్రీ అష్ట లక్ష్మీ సహిత లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయం లో అంగ రంగ వైభవంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల లో భాగంగా ఈరోజు 9 వ రోజు ఉదయం సామూహిక శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం,స్వాములకు పంచామృత అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు, పంచ హారతి జరిగింది. సాయంత్రము శ్రీదేవీ, భూదేవీ, సమేత శ్రీ మ న్నారాయణ స్వామి శేష వాహనం పై దర్శన మిచ్చారు. మాతల కోలాటాలు, నృత్యాల మధ్య అంగ రంగ వైభవంగా శేష వాహన సేవ జరిగింది.ఈ కార్య క్రమం లో ఆలయ అధికారులు డా శశి కుమార్, డా వందన, శ్రీ వన్స్, శ్రీ నీకేత్, విఘ్నేష్ తది తరులు పాల్గొన్నారని, శనివారం దసరా రోజు ప్రముఖ జ్యోతిష్య, పౌరాణిక, వేధ పండితులు శ్రీమాన్ నంబి వేణు గోపాల ఆచార్య కౌశిక చే షమీ పూజ తో కార్య క్రమాలు ముగుస్తాయని,సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం తెలిపారు.

## గొల్లపల్లిలో వ్యక్తి ఆత్మహత్య

గొల్లపల్లి అక్టోబర్ 11 (ప్రజా మంటలు) :
గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన గడ్డం జలంధర్ రెడ్డి వయసు 38 గత కొన్ని నెలల నుంచి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది, గడ్డి మందు తాగాడు గమనించి వెంటనే కరీంనగర్ అపోలో ఆసుపత్రికి తరలించారు అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మరణించిగా భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిహెచ్ సతీష్ తెలిపారు.

## గాంధీలో వరల్డ్ ఎగ్ డే సెలబ్రేషన్స్

సికింద్రాబాద్, అక్టోబర్ 11 ( ప్రజామంటలు ) :



గాంధీ ఆసుపత్రిలో శు క్రవారం వరల్డ్ ఎగ్ డే ను పురస్కరించుకొని ఆలిండియా వెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి మాట్లాడుతూ..పోషక విలువలతో కూడిన గుడ్లను తినడం ఆరోగ్యానికి మంచిదన్నారు. ఈసందర్భంగా ఆర్గనైజర్లు ఆసుపత్రి లోని రోగులు, వారి సహాయకులు, సిబ్బందికి ఆరు వేల గుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఈసీసీ ప్రతినిధులు, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.జీకే సునీల్, ఆర్ఎంవోలు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## కన్నుల పండువగా బతుకమ్మ వేడుకలు

సికింద్రాబాద్, అక్టోబర్ 11 ( ప్రజామంటలు)



సికింద్రాబాద్ పద్మారావునగర్ సాయిబాబా ఆలయ సమీపంలో మహిళలు బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. తీరొక్క రంగు, రంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలను ఓ చోట పెట్టి వందలాది మంది మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ పాటలతో ఆడి, పాడారు. అనంతరం జీహెచ్ఎమ్సీ ఏర్పాటు చేసిన వాటర్ పాండ్ లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

## దుర్గామాత పూజకు విరాళం



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 11
(ప్రజా మంటలు) :
ఇబ్రహీంపట్నం మండలంలో డబ్బా గ్రామంలోని దుర్గా నవరాత్రుల్లో భాగంగా పూజా కార్యక్రమాల కొరకు గౌడ సంఘ సభ్యులు దుర్గాదేవి కమిటీ అధ్యక్షులు యాట ముఖేష్ కు 5016 రూపాయలు గౌడ సంఘ నేరెళ్ల సుభాష్, ఎలుక అశోక్, నేరెళ్ల సత్యం గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లింగంపల్లి గంగాధర్, దుద్దుల మైపాల్, నేరెళ్ల రిశ్వంత్ గౌడ్, రాపల్లి శివకుమార్, చీకటి వేణు,, దుద్దుల మధు,గోగ్ర రాజేష్, ఎలుక నరేష్, మణిదీప్, మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## జనాభాలో అధికం..అవకాశాల్లో అత్యల్పం..

### ముదిరాజ్ లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలి..

### రౌండ్ టేబుల్ సమావేశంలో ముదిరాజ్ నేతల డిమాండ్




సికింద్రాబాద్, అక్టోబర్ 11 ( ప్రజామంటలు) :
ముదిరాజ్ ల చిరకాల వాంఛ అయిన బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చే ప్రక్రియ ను వెంటనే ప్రభుత్వం అమలు పరచాలని రాష్ట్ర ముదిరాజ్ నేతలు డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్క్లబ్ లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ముదిరాజ్ సంక్షేమ సమితి అధ్యక్షులు అల్లం దుర్గం సురేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ..ఎన్నికల్లో రాష్ట్రంలోని అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ లకు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామిని అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినా అమలు చేయకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న ముదిరాజ్ లు రాజకీయ, ఆర్థికంగా, సామాజికంగా ఇలా అనేక రంగాల్లో వెనకబడి ఉన్నారన్నారు. ముదిరాజ్ బిడ్డలు భవిష్యత్ లో బాగుపడాలంటే బీసీ ఏ లోకి మార్చడం ఒకటే మార్గమన్నారు. ఇంకా ఎలాంటి జాప్యం చేయకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముదిరాజ్ ల దీర్ఘకాలిక సమస్యగా మిగిలిన బీసీ ఏ డిమాండ్ ను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ముదిరాజ్ నాయకులు పొట్లకాయల వెంకటేశ్వర్లు, కనకయ్య, శ్రీనివాస్, సంజయ్, డాక్టర్ మూర్తి, మధు, తదితరులు పాల్గొన్నారు.

## శమీ పూజ ఏర్పాట్లను పరిశీలించిన జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల అక్టోబర్ 11
(ప్రజా మంటలు) :



విజయదశమి సందర్భంగా రేపు కోరుట్ల మున్సిపల్ పట్టణ పరిధిలో నిర్వహించనున్న శమీ పూజ జంబి గద్దె ప్రాంతాన్ని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పరిశీలించారు. ఇటీవల జంబి గద్దె ఆధునీకరణ కోసం ఆరు లక్షల రూపాయలు నిధులు మంజూరు కాగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను కృష్ణారావు కోరారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు వెంట కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంతం రాజం, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, ఎంబేరి నాగభూషణం, అన్నం అనిల్, ఆడెపు మధు, పుప్పాల ప్రభాకర్, మోర్తాడ్ లక్ష్మీనారాయణ వెంక గౌడ్, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీలో ట్రీట్మెంట్ పొందుతూ పేషంట్ మిస్సింగ్


సికింద్రాబాద్, అక్టోబర్ 11 ( ప్రజామంటలు) :



గాంధీ ఆసుపత్రి లో ట్రీట్మెంట్ పొందుతున్న ఓ పేషంట్ అదృశ్యమైన ఘటన ఇది..చిలకలగూడ ఎస్.ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం...మొయినాబాద్ కు చెందిన ఎం.కృష్ణ (64) అనారోగ్యంతో గాంధీ ఆసుపత్రిలో చేరాడు. ఇతడికి సహాయకురాలిగా ఉన్న భార్య కల్పలత వాష్ రూమ్ కు వెళ్ళి వచ్చేసరికి భర్త కృష్ణ బెడ్ పై నుంచి కనిపించకుండా పోయాడు. తెలిసిన అన్ని చోట్ల కుటుంబసభ్యులు వెతికినప్పటికీ ఎక్కడ కూడ కృష్ణ ఆచూకీ లభించలేదు. దాంతో చివరికి కుటుంబసభ్యులు చిలకలగూడ పోలీసులను ఆశ్రయించారు. ఫొటోలోని వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు చిలకలగూడ పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని ఎస్.ఐ ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు.

## ఉజ్జయిని అమ్మవారి సన్నిధిలో మాజీ మంత్రి మర్రి పూజలు

సికింద్రాబాద్, అక్టోబర్ 11 ( ప్రజామంటలు)
సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహాకాళి అమ్మవారిని శుక్రవారం మాజీ మంత్రి, మాజీ ఎన్డీఎమ్ఏ వైస్ ప్రెసిడెంట్ మర్రి శశిధర్ రెడ్డి స్థానిక నాయకులతో కలసి దర్శించుకున్నారు. దేవి నవరాత్రోత్సవాల నేపద్యంలో ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఈసందర్భంగా మర్రి శశిధర్ రెడ్డికి అమ్మవారి పరిమళ తీర్థ ప్రసాదాలను అందచేసి,ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో సనత్ నగర్ నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ధర్మపురి నుండి హైదరాబాద కు ఏసి బస్సు ప్రారంభం

ధర్మపురి అక్టోబర్ 11
(ప్రజా మంటలు) :




ప్రతి రోజు రాత్రి 11.30 గంటలకు ప్రముఖ పుణ్య క్షేత్రం ధర్మపురి నుండి హైదరాబాద్ కు , ధర్మపురిలోని స్థానిక బస్ స్టాండ్ నుండి నాదస్తునడాని, బస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ అన్నారు. అధికారులు, మండల నాయకులతో కలిసి ఆయన బస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,, ప్రతి రోజు రాత్రి 11.30 గంటలకు ప్రయాణికుల సౌకర్యార్థం ధర్మపురి నుండి హైదరాబాద్ కి ఏసీ బస్సును ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని, ఈ బస్సు వల్ల ధర్మపురికి వచ్చే భక్తులకు ప్రయాణికులకు కొంత ఇబ్బందులు తొలగుతాయని, బస్సును మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. ,రానున్న రోజుల్లో ధర్మపురికి బస్ డిపోను కూడా తీసుకురావడానికి తనవంతు కృషి చేస్తామని,ఇట్టి విషయం పైన కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు,మంత్రి పొన్నం ప్రభాకర్ గారు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు,రెవెన్యూ అధికారులు,పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధి రాత్రి రూపంలో అమ్మవారు

(రామ కిష్టయ్య సంగన భట్ల)
ధర్మపురి అక్టోబర్ 11 (ప్రజా మంటలు) :
ధర్మపురి క్షేత్రస్థ శ్రీరామలిం గేశ్వరాయలంలో ప్రతిష్ఠిత శారదామాత శుక్ర వారం సిద్ధి రాత్రి దేవి రూపంలో దర్శనమిచ్చింది. దుర్గా మాత నవమ శక్తి సిద్ధి రాత్రి నామంతో ప్రసిద్ధి. అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకమ్య, ఈశిత్వ, వశిత్వ అని అష్ట సిద్ధుల పేర్లు. దేవీ పురాణానుసారం శివుడు సిద్ధిరాత్రి కృప వల్ల ఈ అష్ట సిద్ధులు పొందినట్లు, అర్ధ శరీరం దక్కి, శంకరుడు అర్ధనారీశ్వరుడు అయినట్లు కథనం. దక్షిణ పైచేయిలో గద, కింది చేతిలోచక్రం, వామ పై చేతిలో కమలం, ఎడమ కింది చేతిలో శంఖం కలిగి, సింహ వాహనంపై ఉండే దేవి శుభముల ఫల దాయినిగా, నవమ దినం నాడు సిద్ధి రాత్రి దేవిగా ఆరాధించడం సంప్ర దాయం. నవదుర్గలలో సిద్ధి రాత్రి దేవి మహా శక్తి సంపన్నురాలై పారలౌకిక కామలన్నింటినీ సిద్ధింప చేయగలదని, ఆదేవిని ఉపాసించడం వల్ల సకల పాపాలు మటుమాయమై పోతాయనే భక్తుల విశ్వాసం. ఈనేపథ్యంలో సిద్ధి రాత్రి మాతృ ధ్యాన, స్మరణ, పూజ, ఆరాధన వల్ల సకల శుభాలు కలుగు తాయనే విశ్వాసంతో అమ్మవారిని అందుకు అనుగుణంగా అలంకరించి, పూజలు నిర్వహించగా వేలాది మంది భక్తులు తన్మయత్వంతో ప్రార్థించారు. దేవస్థానం ఇఓ శ్రీనివాస్, సిబ్బంది ఏర్పాట్లు గావించారు. క్షేత్రంలోని శ్రీనర్మదేశ్వర మందిరంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో అంతర్భాగంగా శుక్ర వారం రాత్రి కన్నె ముత్తయిదువులకు పూజలు జరిపించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు కన్నె ముత్తయిదువులను మందిర ప్రాంగణాన ఆసీనులజేసి, పసుపు, కుంకుమ, తాంబూలం, పూలు, పండ్లు, నూతన వస్త్రాలు, దక్షిణలు సమర్పిం చారు. అత్యధిక భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. శరన్నవరాత్రి వేడుకలలో అంతర్భాగంగా స్థానిక నర్మదేశ్వర మందిరంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజా దులను నిర్వహించారు. నవ దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం జరిపించారు. ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## దసరా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల అక్టోబర్ 11 (ప్రజా మంటలు)
దసరా పండుగ ను జిల్లా ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా భద్రత పరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు.చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, చట్టానికి లోబడి నడుచుకోవాలని తెలిపారు. చట్టానికి విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తించిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దసరా పండుగను, దుర్గ నిమజ్జన ను శాంతియుతంగా, సామరస్యంగా జరుపుకోవాలని అందుకు ప్రజలు పూర్తిగా పోలీసు వారికి సహకారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో జమ్మి చెట్టు పూజా, నరకాసుర వధ జరేగే జంబిగద్దె ప్రాంతాన్ని పరిశిలించి భద్రత పరంగా చేయవల్సిన ఏర్పాట్ల గురించి అధికారులకి సూచనలు చేశారు.ఎస్పీ వెంట డీఎస్పీ రఘు చందర్, ఎస్ బి ఇన్స్పెక్టర్ అరిఫ్ అలీ ఖాన్, టౌన్ ఇన్స్పెక్టర్ వేణు గోపాల్ రూరల్ సి.ఐ కృష్ణ రెడ్డి, ఎస్. ఐ సదాకార్ ఉన్నారు.

## కేంద్రం నుంచి నిధులు తేవడంలో విఫలం

### కాంగ్రెస్, బిజెపిలపై హరీష్ రావు ఫైర్

హైదరాబాద్,అక్టోబర్ 11 (ప్రజా మంటలు)



తెలంగాణకు రావాల్సిన నిధుల కోసం పోరాడడంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఘోరంగా విఫలమయ్యాయని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. గోదావరి పుష్కరాలకు తెలంగాణకు కేంద్రం మొండి చెయ్యి చూపడంపై ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. గోదావరి పుష్కరాల కోసం కేంద్రం ఆంధ్రప్రదేశ్కి రూ.100 కోట్ల నిధులు ఇచ్చింది.. కానీ తెలంగాణకు గుండు సున్న ఇచ్చింది. మన రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా.. ఒక్క రూపాయి కూడా కేంద్రం తెలంగాణకు ఇవ్వలేదని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్కు ప్రత్యేక నిధుల కింద రూ. 15 వేల కోట్లు మంజూరు కాగా.. తెలంగాణకు మాత్రం దక్కింది గుండు సున్నా అన్నారు. లోక్సభలో బీఆర్ఎస్ బలమైన స్థానంలో ఉండి ఉంటే.. ఈ అన్యాయాన్ని మేము ఎప్పటికీ సహించేవాళ్లం కాదన్నారు.ఎప్పటికైనా ఇంటిపార్టీ బీఆర్ఎస్సే తెలంగాణకు రక్షణ కవచం అన్నారు. తెలంగాణకు జరిగిన అన్యాయాలపై ఇప్పటికైనా ఆ పార్టీలు స్పందించాలని డిమాండ్ చేశారు.

# చెడుపై విజయమే విజయ దశమి



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494


నవరాత్రి పదంలో నవ శబ్దం తొమ్మిది సంఖ్యను సూచిస్తుంది. నవరాత్రులను నవ అహోరాత్రాలు అని ధార్మిక గ్రంధాలు వివరిస్తున్నాయి. అంటే తొమ్మిది పగళ్ళు, తొమ్మిది రాత్రులు నిర్వర్తించే దేవి పూజకు ఒక ప్రత్యేక విధానం ఉంది. ఆశ్వయుజ శుక్ల పక్ష పాడ్యమి తిథి నుండి పూర్ణిమ వరకు తొమ్మిది రాత్రులు తొమ్మిది పగళ్ళు అమ్మవారిని పూజించడం ప్రశస్తంగా చెప్పబడింది. దీనినే 'శరన్నవరాత్రులు' లేదా 'దేవి నవరాత్రులు' అంటారు.

నవ రాత్రి వాస్తవానికి ఋతువుల సంధికాలం. అందుచేత సృష్టికి కారణమైన మహా మాయ తీవ్రవేగం కలిగి ఉంటుంది. పూజాదుల చేత ఆమెను ఆహ్వానించటం సులభ సాధ్యం. తొమ్మిది రోజులు నవ దుర్గలను నిష్ఠగా ఉపాసించే ఆరాధకులకు దేవి అనుగ్రహం లభిస్తుంది. నవ రాత్రులలో రాహుకాల వేళ రాహుకాల దీపం వెలిగించాలి. రాహు ప్రతికూల ప్రభావం తగ్గి, దోష నివారణ జరుగుతుంది. దేవి అర్చనలో లలితా సహస్రనామాలు, దుర్గాసప్తశతి పారాయణ చేసే భక్తుల కోరికలు నెరవేరుతాయి. రోగ పీడలతో బాధపడే వారు, జాతకంలో అపమృత్యు దోషం ఉన్నవారు ఈ తొమ్మిది రోజులు నియమం తప్పకుండా దేవి ఆరాధన చేయడం శుభకరం.

సాధారణంగా విజయ దశమి నాడు శ్రవణ నక్షత్రం ఉంటుంది. నక్షత్ర మండలంలో శ్రవణ నక్షత్రం చెవి ఆకారంలో ఉంటుంది. అందుకే ఈ రోజు ఏదైనా కొత్త విద్యలు నేర్చుకోవాలనుకొనేవారు ఈ రోజు ప్రారంభిస్తే విశేషంగా లాభిస్తుంది. శమీ చెట్టు యొక్క పూజ ఈ రోజు విశేషంగా లాభిస్తుంది. జమ్మి చెట్టును పూజించడం లక్ష్మీప్రదమని పురాణాలు చెబుతున్నాయి. శమీ వృక్షం సువర్ణ వర్షం కురిపిస్తుందని శాస్త్రాల్లో ఉంది. విజయ దశమి రోజున పూజలు అందుకొన్న జమ్మి చెట్టు ఆకులను ఇంట్లోని పూజాస్థలంలో, ధన స్థానంలో నగదు పెట్టెల్లో ఉంచుతారు. దీనివల్ల ధనవృద్ధి జరుగుతుంది.

పరమ శివునికి జగన్మాత దుర్గాదేవికి, సిద్ధి ప్రదాత గణపతికి శమీ పత్రి సమర్పించే ఆచారం అనాదిగా వస్తోంది. పూర్వం జమ్మి చెట్టు కాడల రాపిడి ద్వారా సృష్టించిన అగ్నితోనే యజ్ఞ యాగాదుల క్రతువులు నిర్వహించేవారు. ఇవాల్టికి దేశంలోని వివిధ ప్రాంతాల్లో శమీ వృక్షంలో అగ్ని ఉంటుందనే విశ్వాసం దృఢపడింది. అగ్ని వీర్యమే సువర్ణం కనుక జమ్మి బంగారం కురిపించే చెట్టుగా పూజార్హత పొందింది. ఈ రోజే శ్రీ రాముడు రావణునిపై విజయం సాధించాడు. విజయదశమి రోజునే శమీ పూజ కుడా నిర్వహిస్తారు.

శ్రీరాముని వనవాస సమయంలో కుటీరం జమ్మి చెట్టు చెక్కతోనే నిర్మించారని చెబుతారు. శమి అంటే పాపాల్ని, శత్రువుల్ని నశింపజేసేది. పంచ పాండవులు అజ్ఞాత వాసానికి వెళ్ళే ముందు తమ ఆయుధాలని శమీ చెట్టుపై పెట్టడం జరిగింది. సామాన్యులే గాక యోగులు



నవరాత్రులలో అమ్మవారిని పూజిస్తారు. ముఖ్యంగా శాక్తేయులు దీనిని ఆచరిస్తారు. ఆలయాలలో అమ్మవారికి విశేష అలంకరణలు, బొమ్మల కొలువు పెట్టడం ఒక ఆనవాయితీ. ఈ తొమ్మిది రోజులు ఒక్కో రోజు ఒక్కో అలంకారం చేసి, పూజిస్తారు. అమ్మవారు లోక కళ్యాణం కోసం ఒక్కోరోజు ఒక్కో అవతారం ధరించింది. అందువలన అలా అమ్మవారు అవతరించిన రోజున, ఆ రూపంతో అమ్మవారిని అలంకరించి ఆ నామంతో ఆరాధిస్తూ ఉంటారు.

## దసరా ఉత్సవాలకు బ్రిటిషర్ల ప్రోత్సాహం

### ఆయుధంగా వాడుకున్న రాబర్ట్ క్లైవ్

కోల్‌కతా,అక్టోబర్11 (ప్రజామంటలు):

రాబర్ట్ క్లైవ్ సారథ్యంలోని ఈస్టిండియా కంపెనీ సేన 1757లో జరిగిన ప్లాసీ యుద్ధంలో బెంగాల్ నవాబు సిరాజుద్దౌలాను ఓడించి బెంగాల్‌పై పట్టు సంపాదించింది. భారత్‌లో తొలి విజయానికి ప్రతీకగా దుర్గామాతకు పూజచేసి విజయోత్సవం జరుపుకున్న ఈ ఉత్సవాలు క్రమంగా జాతీయో ద్యమానికి ఊతమయ్యాయి. అంతకుముందు ఇళ్లకే పరిమితమైన ఈ దసరా నవరాత్రులు క్రమంగా సామాజిక రూపం దాల్చటం కీలక పరిణామం. ఈస్టిండియా రాకతో బెంగాల్‌లో కీలకభూమిక పోషించిన జమీందార్లు, సంపన్నులు తమ ఆధిపత్యాన్ని, ప్రభుత్వంలో పట్టును, దర్పాన్ని చాటడానికి ఈ ఉత్సవాలను వేదికలుగా చేసుకున్నారు. తమ అధికారానికి కూడా ఈ ఉత్సవాలు దోహదం చేస్తుండటంతో ఈస్టిండియా కంపెనీ అధికారులూ ప్రోత్సహించారు. గవర్నర్ జనరల్ లార్డ్ వెస్లీ కాళీమాతకు గౌరవ ప్రదంగా తొమ్మిది తుపాకుల శాల్యూట్‌ను ప్రవేశపెట్టారు. అలా జమీందార్ల పర్యవేక్షణలో సాగిన దుర్గాపూజ జాతీయోద్యమం ప్రభావంతో సామాన్య ప్రజల ఉద్యమంగా మారింది. 1919లో జమీందార్లకు సంబంధం లేకుండా సామాన్య ప్రజానీకం దుర్గాపూజ నిర్వహించింది. దీన్ని బరోయారి (12 మందితో చేసిన) పూజ అంటారు. బాగ్‌బజార్‌లో సర్వజనపూజ మొదలైంది. వీటిలో క్రమంగా జాతీయోద్యమ నాయకులు, విప్లవనాయకులు కూడా ప్రవేశించారు. 1930లో కోల్‌కతా మేయర్‌గా ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ సర్వజన పూజను ముందుండి నడిపించారు. జాతీయోద్యమ ప్రచారానికి, స్వదేశీ వస్తువుల ప్రోత్సాహానికి ఈ ఉత్సవాలు వేదికగా మారాయి.



# ఆయుధ పూజకు ప్రాధాన్యం

### వాహన పూజలకూ ప్రత్యేకత

హైదరాబాద్, (ప్రజామంటలు):

దసరా రోజున లోహ పరికరాలను, ఆయుధాలను పూజించే సాంప్రదాయం ఉంది. ఆధునిక కాలంలో వాహనాలను కూడా పూజిస్తున్నారు. వాహనాలను శుభ్రం చేసి దసరా రోజు పూలదండ వేసి పూజలు చేస్తున్నారు. పోలీస్ స్టేషన్లు, బరాక్స్‌లలో కూడా ఆయుధాలను పూజించడం ఆనవాయితీగా మారింది. దీనికి కూడా దుర్గాదేవి లోహుడు అనే రాక్షసుని వధిస్తే లోహం పుట్టిందని .. అందుకనే దసరా రోజున లోహపరికరాలని పూజించే ఆనవాయతీ వచ్చిందని చెబుతారు. దుర్గ అంటే దుర్గములను తొలగించేది అని అర్థం. దుర్గేయురాలు కనుక దుర్గ అయింది. పురాణాల ప్రకారం దుర్గ అంటే అర్థం ఏమిటంటే దుర్ అంటే దుఃఖం, దుర్భిక్షం, దుర్వ్యసనం, దారిద్ర్యం మొదలైనవి. 'గ' అంటే నశింపచేసేది. కనుక దుర్గను ఆరాధించడం వలన దుష్టశక్తులు, భూత, ప్రేత, పిశాచ, రాక్షసుల బాధలు దరిచేరవు అని నమ్మకం. అందుకనే నవ రాత్రులు తొమ్మిది రోజుల్లో మొదటి మూడు రోజులు దుర్గారూపాన్ని ఆరాధించి అరిషడ్వర్గాలను.. తర్వాత మూడు రోజులు లక్ష్మి రూపాయలను ఆరాధించి సిరిసంపదలను, చివరి మూడు రోజులు సరస్వతి దేవి రూపాలను ఆరాధించి జ్ఞానాన్ని పొందుతారని పెద్దల నమ్మకం. ఈ తొమ్మిది రోజులు దుర్గసహస్రనామ పారాయణము అత్యంత ఫలవంతం. అంతేకాదు'దుం' అనే బీజాక్షరముతో కలిపి దుర్గాదేవిని పూజిస్తారు. ఈ దుర్గాష్టమి సోమవారం రోజున వస్తే అత్యంత శ్రేష్టమైన రోజుగా భావిస్తారు. దసరా నవరాత్రి దీక్షలో అతి ముఖ్యమైనది తిది నవమి. ఈ తొమ్మిదవ రోజు మంత్ర సిద్ధి కలుగును. కనుక 'సిద్ధదా' అని నవమికి పేరు. ఈ మహర్నవమి రోజున దేవి ఉపాసకులు అంతవరకు తాము చేసిన జపసంఖ్య ఆధారంగా హోమాలు చేస్తారు. ఇలా చేయడం వలన సర్వసిద్ధుల సర్వాభీష్ట సంసిద్ధి కలుగుతుందని నమ్మకం. ఈ మహర్నవమి రోజున క్షత్రియులు, కార్మికులు, వాహన యజమానులతో పాటు కులవృత్తులవారు తమ తమ ఆయుధాలను, పని ముట్లను పూజిస్తారు.విజయదశమి: దసరా నవరాత్రులలో చివరి రోజు విజయ దశమిగా జరుపుకుంటారు. ఆశ్వయుజ దశమికి శ్రవణా నక్షత్రంతో కలిస్తే విజయా అనే సంకేతం అని అర్ధం. అందుకనే దీనికి 'విజయదశమి అనే పేరు వచ్చింది. ఇలా నవరాత్రులు భక్తీ శ్రద్దలతో అమ్మవారిని పూజించి అమ్మ దయకు పాత్రులవుతారు. అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే భావిస్తారు అమ్మవారు భక్తులు .

# వైభవంగా ముగిసిన బతుకమ్మ వేడుకలు

### జిల్లాలో ఉత్సాహంగా సాగిన పూలపండగ

### ఆడిపాడిన ఆడపడచులు..యువత కేరింతలు

### వచ్చే యేడాది రావాలంటూ వేడుకోలు

హైదరాబాద్, (ప్రజామంటలు):

తొమ్మది రోజుల పాటు సందడి చేసిన బతుకమ్మ సంబరాలు ముగిసాయి. వచ్చే యేడాది మళ్లీ రావమ్మా అంటూ ఆడపడచులు వీడ్కోలు పలికారు. గురువారం సద్దుల బతుకమ్మతో ఊరూవాడ సందడిగా కొనసాగింది. ఆడపడుచుల వీడ్కోలుతో బతుకమ్మ సాగిపోయింది. తెలంగాణలో ఆడబిడ్డలు తొమ్మిది రోజులపాటు పూల జాతరతో జరుపుకున్న బతుకమ్మ పండుగ సద్దుల బతుకమ్మతో ఘనంగా ముగిసింది. సద్దుల బతుకమ్మ సందర్భంగా పల్లె, పట్నం, ఊరూ, వాడా, తంగేడు, గునుగు పువ్వుల వనాలయ్యాయి. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ విద్యుత్ దీపకాంతుల్లో వెలిగిపోయింది. మొత్తంగా సద్దుల బతుకమ్మ పండుగ సంబురంగా ముగిసింది. తెలంగాణ ఇంట ఆడబిడ్డలు తొమ్మిది రోజులపాటు రకరకాలపూలతో ఆనందంగా జరుపుకొన్నారు. చిన్నా, పెద్దా తేడాలేకుండా ఆడబిడ్డలు రామ రామ రామ ఉయ్యాలో.. తొమ్మిది రోజులు ఉయ్యాలో.. అంటూ ఆడిపాడారు. ముప్పై మూడు జిల్లాల తెలంగాణ బిడ్డలకు దీవెనలు ఇస్తూ బతుకమ్మ.. గంగమ్మ ఒడికి చేరింది. పూల సింగిడి సందడి చేసింది.. సద్దుల సంబురం కనులవిందు చేసింది.. ఆడపడుచుల ఆనందం ఆకాశాన్నంటింది.. తొమ్మిదిరోజుల పాటు సంబురంగా జరుపుకున్న బతుకమ్మ వేడుకలను ఆడపడుచులు సంబురంగా జరుపుకున్నారు. ఎంగిలి పూల బతుకమ్మతో మొదలైన బతుకమ్మ సంబురాలు తొమ్మిది రోజుల పాటు అంగరంగవైభవంగా జరిగాయి. ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకల్లో పాల్గొని చివరిరోజు ట్యాంక్‌బండ్‌తో సహా, జిల్లాల్లో భారీ బతుకమ్మతో వేడుకలు నిర్వహించుకోగా సద్దుల బతుకమ్మను జిల్లా మహిళా మణులు భారీ బతుకమ్మలతో ఆడిపాడారు. అన్ని గ్రామాల్లో పూలపండగతో మహిళలు సందడి చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆడపడుచులు పెద్ద ఎత్తున బతుకమ్మ కార్యక్రమాల్లో పాల్గొని ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. చివరి రోజు ప్రతీ ఇంటా బతుకమ్మను పేర్చి ఇళ్లవాకిళ్ల ఎదుట బతుకమ్మ పాటలతో ఆడిపాడి చివరికి బతుకమ్మ ఘాట్‌ల వద్ద కూడా చిందేశారు. బతుకమ్మ ఉత్సవంలో చివరిరోజు జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు పాల్గొని సందడి చేశారు. ఆడపడుచులతో ఆడిపాడి సంబురం లో పాల్గొన్నారు. గల్లీల నుంచి పట్నం వరకు చిన్నారుల నుంచి పెద్దల వరకు బతుకమ్మ ఉత్సవాలను కనుల పండువగా జరుపుకున్నారు.



ప్రభుత్వం బతుకమ్మ ఉత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంతో ప్రభుత్వ శాఖల అధికారులు అన్ని కార్యాలయాల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. రోజుకొక శాఖ ఉద్యోగులు కార్యాలయాల్లో బతుకమ్మలు పేర్చి డీజే పాటలతో సందడి చేశారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ విద్యుత్ దీపకాంతుల్లో వెలిగిపోయింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బతుకమ్మ ఉత్సవాలు ట్యాంక్‌బండ్ వద్ద సంబరంగా సాగాయి. సాంస్కృతిక కళారూపాలతో, పెద్దఎత్తున డప్పు చప్పుళ్లు, కళాకారుల నృత్యాలతో ట్యాంక్‌బండ్‌వరకు ఊరేగింపు కళాత్మకంగా సాగింది. రాత్రి పొద్దుపోయేవరకు ట్యాంక్‌బండ్‌పై ఆడబిడ్డలు బతుకమ్మ ఆడారు. వరంగల్ నగరంలో సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. వేల మంది మహిళలు హన్మకొండలోని పద్మాక్షి గుండం, వరంగల్‌లోని రంగసముద్రం వంటి ప్రాంతాల్లో ఆడిపాడారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కామారెడ్డి, యాదాద్రి భువనగిరి, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో సద్దుల పండుగ ఉత్సాహంగా సాగింది. పలు ప్రాంతాల్లో ఉత్తమ పాట, ఆటలకు బహుమతులు ప్రకటించడంతో ఆడిపాడేందుకు యువతులు పోటీపడ్డారు. సిద్దిపేటలో పెద్ద ఎత్తున కోమటి చెరువు వద్ద ఆడిపాడారు.

# పండగల్లో దసరాకు విశిష్ట స్థానం !

దసరా హిందువుల ముఖ్యమైన పండుగ. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులు పదవరోజు విజయ దశమి కలసి దసరా అంటారు. ఇది ముఖ్యముగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ. ఈ పండుగను నవరాత్రి, శరన్నవరాత్రి అని అంటారు. శరదృతువు ఆరంభంలో వచ్చే పండుగ కనుక ఈ పేరు వచ్చింది. కొందరు ఈ పండుగకు మొదటి మూడు రోజులు పార్వతిదేవికి, తరువాతి మూడు రోజుల లక్ష్మీ దేవికి, తరువాత మూడురోజులు సరస్వతి దేవికి పూజలు నిర్వహిస్తారు. ముఖ్యముగా శాక్తేయులు దీనిని ఆచరిస్తారు. విజయదశమి రోజున చరిత్ర ప్రకారం రాముడు రావణుని పై గెలిచిన సందర్భమే కాక పాండవులు వనవాసం వెళ్తూ జమ్మి చెట్టుపై తమ ఆయుధాలను తిరిగి తీసిన రోజు. ఈ సందర్భమున రావణ వధ, జమ్మి ఆకుల పూజా చేయటం రివాజు. జగన్మాత అయిన దుర్గాదేవి, మహిషాసురుడనే రాక్షసునితో 9 రాత్రులు యుద్ధము చేసి అతనిని వధించి జయాన్ని పొందిన సందర్భమున 10వ రోజు ప్రజలంతా సంతోషంతో పండగ జరుపుకున్నారు. అదే విజయదశమి.హిందువులు జరుపుకునే పండగలలో దసరా పండగకు విశిష్ట స్థానం ఉంది. ఆశ్వయుజ మాసం శుక్లపక్షంలో మొదటి తొమ్మిది రోజులను దసరా నవరాత్రులు, దేవీ నవరాత్రులు లేక శరన్నవరాత్రులు అని అంటారు. ఈ దసరా ఉత్సవాన్ని నవరాత్రులుగా తొమ్మిది రోజులు పాటు జరుపుకుని.. 10వ రోజున దసరా లేదా విజయదశమిగా జరుపుకుంటారు. ఈ తొమ్మిది రోజులు శక్తిస్వరూపిణి అయిన దుర్గాదేవి అవతారాలను అంటే నవదుర్గలను అత్యంత భక్తీ శ్రద్దలతో పూజిస్తారు. ఈ దేవీ నవరాత్రులలో చివరి మూడు రోజులు, దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమిగా జరుపుకుంటూ విద్యార్థులు పుస్తకాలూ, పెన్నులను పూజిస్తే, శ్రామికులు తమ పనిముట్లను పూజిస్తారు. ఇక క్షత్రియులు ఆయుధ పూజ చేసి.. అమ్మవారి కృపకు పాత్రులవుతారు. దుర్గాదేవి మహిషాసురమర్దనిగా అవతరించి రాక్షసుని మీదకు దండెత్తి విజయం సాధించింది. అంతేకాదు రాముడు రావణ సంహారం చేసింది దసరనే.. కనుక పూర్వం రాజులు తమ దండయాత్రకు దసరా పండగానే శుభ ముహోర్తంగా ఎంచుకునే వారని తెలుస్తోంది. దేవీ పూజ ప్రాధాన్యత ఈశాన్య భారతదేశంలో హెచ్చుగా ఉంటుంది. దైత్యవంశానికి ఆశాదీపంలా జన్మించిన 'మహిషాసురుడు' తన ఆంతరంగిక మిత్రులతో, సచివులతో సమాలోచన చేసి, మరణంలేని జీవనం కోసం మేరుపర్వతశిఖరం చేరి బ్రహ్మదేవుని గూర్చి ఘోరతపస్సు ప్రారంభించాడు. కాలం కదలికలో అనేక వేల సంవత్సరాలు కదిలి వెళ్లిపోయాయి. మహిషాసురుని అచంచల తపస్సుకు సంతసించిన బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై, 'మహిషాసురా.., ఇంక తపస్సు చాలించి ఏ వరం కావాలో కోరుకో' అన్నాడు.'పితామహా.,నేను అమరుణ్ణి కావాలి. నాకు మరణం లేని జీవితాన్ని ప్రసాదించు' అని కోరాడు మహిషాసురుడు. అప్పుడు బ్రహ్మదేవుడు 'మహిషాసురా..పుట్టిన ప్రాణి గిట్టక తప్పదు.., గిట్టిన ప్రాణి మరల పుట్టక తప్పదు. జననమరణాలు సకలప్రాణికోటికి సహజ ధర్మాలు. మహాసముద్రాలకూ, మహాపర్వతాలకూ కూడా ఏదో ఒక సమయంలో వినాశం తప్పదు. ప్రకృతివిరుద్ధమైన నీ కోరిక తీర్చుట అసంభవం. కనుక,నీ మరణానికి మృత్యువుకు ఒక మార్గం విడిచిపెట్టి, మరే వరమైనా కోరుకో' అన్నాడు. అప్పుడు మహిషా సురుడు 'విధాతా..అల్పమైన కోరికలకు ఈ మహిషాసురుడు ఆశపడడు. సరే.. ఆడది నా దృష్టిలో అబల..ఆమెవల్ల నాకే ప్రమాదమూ రాదు. కనుక.,పురుషుడి చేతిలో నాకు మరణం రాకుండా వరం అనుగ్రహించు' అని కోరాడు. బ్రహ్మదేవుడు ఆ వరాన్ని మహిషాసురునికి అనుగ్రహించి అంతర్ధాన మయ్యాడు. బ్రహ్మదేవుని వరాల వలన వరగర్వితు డైన మహిషాసురుడు దేవతలతో ఘోరమైన యుద్ధము చేసి వారిని ఓడించి ఇంద్రపదవి చేపట్టాడు. దేవేంద్రుడు త్రిమూర్తులతో మొర పెట్టుకొనగా మహిషునిపై వారిలో రగిలిన క్రోధాగ్ని ప్రకాశవంతమైన తేజముగా మారింది. త్రిమూర్తుల తేజము కేంద్రీకృతమై ఒక స్త్రీరూపమై జన్మించింది. శివుని తేజము ముఖముగా, విష్ణు తేజము బాహువులుగా, బ్రహ్మ తేజము పాదములుగా కలిగి మంగళమూర్తిగా అవతరించిన ఆమె 18 బాహువులను కలిగి ఉంది. ఆమెకు శివుడు శూలమును, విష్ణువు చక్రమును, ఇంద్రుడు వజ్రాయుధమును, వరుణ దేవుడు పాశము, బ్రహ్మదేవుడు అక్షమాల, కమండలము హిమవంతుడు సింహమును వాహనంగాను ఇచ్చారు. ఇలా సర్వదేవతల ఆయుధములు సమకూర్చుకొని మహిషాసురుని సైన్యంతో తలపడి భీకరమైన పోరు సల్పింది. మహిషా సురుని తరపున పోరు సల్పుతున్న ఉదగ్రుడు, మహాహనుడు, అసిలోముడు, బాష్కలుడు, బిడాలుడు మొదలైన వారిని సంహరించిన తరువాత మహిషాసురునితో అమ్మ తలపడినది. ఈ యుద్ధములో ఆదేవి వాహనమైన సింహమూ శత్రువులను చీల్చి చెండాడింది. దేవితో తలపడిన అసురుడు మహిషి రూపము, సింహరూపము, మానవరూపముతో భీకరముగా పోరి చివరకు తిరిగి మహిషిరూపములో దేవిచేతిలో హతుడైనాడు.ఈ విధంగా అప్పటి నుండి మహిషుని సంహరించిన దినము కాబట్టి మహిషాసుర మర్దనిని కొలిచే దసరా పర్వదినంగా ప్రజలచే కొనియాడబడింది. ఉత్తరభారతంలో దసరాను రావణ దహనంగా నిర్వహిస్తారు. దక్షిణాన శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపుగా నిర్వహిస్తారు. ఇలా ఒక్కోచోట ఒక్కో విధంగా అమ్మవారిని పూజించడం ఆనవాయితీగా వస్తోంది.




# దళిత బంధు రెండవ విడత నిధుల కోసం డి ఎస్ పి ఆధ్వర్యంలో పోరాటం

జమ్మికుంట అక్టోబర్ 11 (ప్రజా మంటలు) : హుజూరాబాద్ నియోజక వర్గంలో దళిత బంధు రెండవ విడత పై అధికార పార్టీ స్పష్టమైన నిర్ణయం తెలియజేయక పోతే రాబోయే రోజుల్లో ధర్మ సమాజ్ పార్టీ రిలే నిరాహారదీక్షలు చేయటం జరుగుతుంది అని తెలియజేస్తున్నాం లబ్ధి ధారులకి న్యాయం జరిగే వరకు అనేక కార్యక్రమాలు చేస్తూ పోరాటం కొనసాగిస్తూనే ఉంటుందీ అని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి శ్రీకాంత్ గారు తెలియజేశారు ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు నరేష్ తాళ్ళ గారు హుజురాబాద్ నియోజక వర్గ నాయకులూ రాకేష్, రవి కిరణ్, సందీప్, సదానందం, రవితేజ, ప్రేమ్ సాగర్, అభిలాష్ , రవికుమార్,రాజు జిల్లా నాయకులూ శ్రీకాంత్,సురేష్ చంద్రశేఖర్ లు పాల్గొనడం జరిగింది.

# కాకతీయ విద్యార్థుల అ"పూర్వ" కలయిక

- 15 సంవత్సరాల తర్వాత కలిసిన విద్యార్థులు..
- ఆనాటి మధుర అనుభూతులను నెమరేసుకున్న స్నేహితులు..
- 2008-2009 పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..



జమ్మికుంట అక్టోబర్ 11 (ప్రజా మంటలు ) : సమాజంలో తల్లీ,తండ్రీ,గురువు దైవంతో సమానమని అంతటి గురువులను కలుసుకోవడం సంతోషంగా ఉందని కాకతీయ విద్యార్థులు అభిప్రాయపడ్డారు.జమ్మికుంట పట్టణంలోని స్వాతి ఫంక్షన్ హాల్ లో కాకతీయ విద్యార్థుల 2008-09 సంవత్సరాలకి చెందిన ఆత్మీయ సమ్మేళనం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకతీయ విద్యాసంస్థల అధినేత ఆవిరినేని సుధాకర్ రావు,జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు,పట్టణ సీఐ వరంగంటి రవి హాజరయ్యారు.అనంతరం వారు మాట్లాడుతూ ఏ వ్యక్తికైనా తల్లిదండ్రులు మొదటి గురువులైతే,విద్యను బోధించిన గురువు రెండవ గురువని,నవ మాసాలు మోసి కనీ పెంచితే,భాహ్య ప్రపంచానికి క్రమశిక్షణ,మంచి నడవడిక ఎలా ఉండాలో తెలియజేసేది గురువు అని,జీవితంలో మరపురాని రూపం బాల్యం అని అలాంటి బాల్యంలో చదువు చెప్పిన గురువులను సన్మానించడం గొప్ప విషయమని అన్నారు.పదిహేను సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు చిరునవ్వులతో,ఆత్మీయ పలకరింపులు,ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు.తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.వివిధ వృత్తులలో ప్రభుత్వ,ప్రైవేటు ఉద్యోగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలో కలసి తిరిగి తమ అనుబంధాలను స్మరించుకున్నారు.తమ విద్య,వైవాహిక,ఉద్యోగ జీవిత విశేషాలు కుటుంబ నేపథ్యాల విషయాల గురించి తెలుసుకొని,ఆనందోత్సాహాలతో గడిపారు.ఈ కార్యక్రమములో అధ్యాపకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# దుర్గామాత మండపం వద్ద సామూహిక చండీ హెూమం

కోరుట్ల అక్టోబర్ 11 (ప్రజా మంటలు) : కోరుట్ల పట్టణంలో త్రిశక్తి మాత ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణేష్ నవదుర్గ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద స్థాపిత దేవత పూజ సామూహిక



చండి హెూమం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా సిద్ధిధాత్రి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వగా, అమ్మవారిని దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ నవ దుర్గా మండలి ఆలయ అధ్యక్షులు కటుకం గణేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా నేడు దుర్గాష్టమిని పురస్కరించుకొని చండీ హవనం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గణేష్ నవదుర్గ మండలి అధ్యక్షులు కటుకం గణేష్, ప్రధాన కార్యదర్శి గజ్జల శంకర్, కోశాధికారి అడువాల ప్రభాకర్, కస్తూరి రాజేశ్వర్, కటుకం గంగారాం, సంకు అశోక్, వేముల రాజేశం, గాజుల రమేష్, వెంకటేశం, కస్తూరి లక్ష్మీనారాయణ, గణేష్ నవదుర్గ మండలి సభ్యులు దుర్గామాత భక్తులు మహిళలు యువకులు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్సీ ఎల్ రమణ

జగిత్యాల అక్టోబర్ 11(ప్రజా మంటలు) : పట్టణం 39వార్డు చెందిన గూడూరి రామచంద్రంకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన అరవై వేల చెక్కును, 01వార్డుకు చెందిన గాజవాడ వీరేశం కుపదిహేను వేల రూపాయల చెక్కులను ఎమ్మెల్సీ కార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్సీ ఎల్ రమణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్



ఎస్ పట్టణ అధ్యక్షులు గట్టు సతీష్,మాజీ జడ్పీటీసీ కొలుముల రమణ, మాజీ పాక్స్ చైర్మన్ సాగి సత్యం రావు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దయ్యాల మల్లారెడ్డి, పార్టీ ఉపాధ్యక్షులు తాజ్ బాయ్, వొళ్ళల గంగాధర్, వనమాల నిరంజన్, గాజుల శ్రీనివాస్, చిలుక రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**సీఎం సహాయ నిధి నిరుపేదలకు ఆసరా నిలుస్తోంది**

**సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ లో ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి**

జగిత్యాల అక్టోబర్ 11 (ప్రజా మంటలు) : జగిత్యాల నియోజక వర్గంలోని 208 మంది లబ్ధిదారులకు రు.59,18,000 విలువైన సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ ఎమ్మెల్సీ జీవన రెడ్డి



పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ, నిరుపేదలకు అండగా నిలిచేందుకు సీఎం సహాయ నిధి ఆసరాగా నిలుస్తుందని, విద్య, వైద్యం పొందడం పౌరుల హక్కు అని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డీ ఆరోగ్య శ్రీలో ఉచితంగా అందించే వైద్య సదుపాయాల పరిమితి రు. 5 లక్షల నుండి రు.10 లక్షలకు పెంచారని, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా నిరుపేదలకు ఆర్థిక భారం కాకూడదని ఆరోగ్య శ్రీ పథకంలో భాగంగా ఉచిత వైద్య సేవలను వై ఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టారు అని గుర్తు చేశారు.నిరుపేదలకు అవగాహన లేక ఆరోగ్య శ్రీ లో ఉచిత వైద్య సేవల సదుపాయం ఉన్నప్పటికీప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారని, దీంతో ఆర్థికంగా చితికి పోతున్నారని, ప్రభుత్వ పరంగా అందుబాటు లో ఉన్న వైద్య సదుపాయం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# దసరా పండక్కి ముస్తాబైన మల్యాల దారి మైసమ్మ దేవాలయం


ఇల్లందకుంట అక్టోబర్ 11 (ప్రజా మంటలు) : మండలం లోని మల్యాల, ఇల్లందకుంట మల్యాల ఇరు గ్రామాల పోలిమేర మధ్య లో ఉన్న శ్రీ దారి మైసమ్మ దేవాలయం మల్యాల, లక్ష్మాజిపల్లే, వాగోడ్డురామన్న పల్లే, ఈ ముడు గ్రామల ఆటో యూనియన్ వారి ఆధ్వర్యంలో మైసమ్మ తల్లికి దసరా పండక్కి ఆటో యూనియన్ నాయకులు యాటలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు.



అలాగే ఆటో యూనియన్ వారి వాహనాలకు ఎలాంటి అపద రాకుండా మైసమ్మ తల్లి చల్లగా చూడాలని మొక్కులు తీర్చుకుంటారు. ప్రతి సంవత్సరం ఇలాగే ఆటో యూనియన్ నాయకులు మైసమ్మ దేవాలయం ముస్తాబు చేసి తమ మొక్కులు చెల్లిస్తారు.

# ఆసుపత్రి లో చేరిన జువ్వాడి నర్సింగ్ రావు

కోరుట్ల అక్టోబర్ 11 (ప్రజా మంటలు) :- కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ రావు, గత నాలుగు రోజుల నుండి తీవ్ర జ్వరంతో హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ దుర్గ మాత ఆశీస్సులతో త్వరగా కోలుకోవాలని కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ ఆకాంక్షించారు.



# వందే మాతరం ఫ్రెండ్ యూత్ దుర్గా దేవి సన్నిధిలో కుంకుమ పూజ, హెూమం

కొడిమ్యాల: అక్టోబరు 11 (ప్రజా మంటలు) : జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రము లోని వందేమాతరం ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మంటప%శీ% వద్ద 9వ రోజు మహిషాసుర మర్దిని అవతారం లో భక్తులకు



దర్శనం ఇచ్చారు. దేవికి కుంకుమ పూజ, హెూమం పెన్న లక్ష్మన్ శర్మ చఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గా మాత ప్రముఖులు కొమురవెల్లి రాకేష్, బైరి రవి, ఏనుగు ఆదిరెడ్డి, బైరి వెంకటి, కాసం మునీ%శీ%దర్, వందే మాతరం ఫ్రెండ్ యూత్ సభ్యులు, భవానీ మాతలు, భక్తులు ,ప్రజలు పాల్గొన్నారు.

# ఈనెల19న సుద్దాల హనుమంతు జానకమ్మ జాతీయ అవార్డు అరుణోదయ నాగన్నకు ప్రదానం

**పోస్టర్ ఆవిష్కరించిన జనగామ కళా,సాహిత్య సంస్థలు**

జనగామ అక్టోబర్ 11 (ప్రజామంటలు) : తాడిత పిడిత ప్రజల వైపు నిలబడి వర్గపోరు బాటలో గళంలో గర్జించిన అలుపెరుగని ప్రజా వాగ్గేయకారులు అరుణోదయ నాగన్న అని పలువురు కొనియాడారు. జనగామ జిల్లా కేంద్రంలో జనగామ రచయితల సంఘం, కవులు కళాకారుల ఐక్యవేదిక, స్వేచ్ఛా పబ్లికేషన్స్ జనగామ సంయుక్త అధ్వర్యంలో ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ తండ్రి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు, ప్రజా గాయకుడు సుద్దాల హనుమంతు జానకమ్మ జాతీయ పురస్కార అవార్డును అరుణోదయ నాగన్నకు ప్రదానం చేయనున్న నేపథ్యంలో జనగామ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, నాగన్న ఈ అవార్డు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుద్దాల ఫౌండేషన్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 19న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే అవార్డు ప్రదానోత్సవం విజయవంతం చేయాలని, జనగామ నుండి కవులు కళాకారులు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రముఖ కవి యోచన హాజరుకాగా ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా కవులు కళాకారులు సాంబరాజు యాదగిరి, జి.కృష్ణ, పానుగంటి రామమూర్తి,జోగు అంజయ్య, కోడం కుమారస్వామి, అయిలా సోమనర్సింహచారి, పెట్లోజు సోమేశ్వరాచారి, గుగ్గిళ్ల నర్సయ్య, గట్టగల్ల సంజీవ, చిలుమోజు సాయికిరణ్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, పిన్నింటి రత్నం, జనగామ శంకర్, మాన్యపు భుజేందర్, అంకాల సోమయ్య, చాపల మహేందర్, గూటం రమేష్, రాగల్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.





# బతుకమ్మ బహుమతి పొందిన మహిళలను అభినందిన ఎమ్మెల్యే

జనగామ అక్టోబర్ 11 (ప్రజామంటలు) : సద్దుల బతుకమ్మలో భాగంగా జనగామ పట్టణంలోని వాసవి కాలనీ మహిళలు అత్యంత సుందరంగా వైభవంగా అతిపెద్ద బతుకమ్మను అత్యంత భక్తి శ్రద్ధలతో తయారు చేశారు. ఈ బతుకమ్మ పట్టణంలో ద్వితీయ బహుమతి పొంది ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చేతుల మీదగా అందుకున్నారు. బతుకమ్మ కు రెండో బహుమతి పొందిన వాసవి కాలనీ మహిళలను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, పట్టణ ఆర్యవైశ్య ప్రధాన కార్యదర్శి గట్టు వెంకటేశ్వర్లు అభినందించారు.

# విజయదశమి రోజున శమీ వృక్ష పూజ, పాల పిట్ట దర్శనం

గొల్లపల్లి అక్టోబర్ 11 (ప్రజా మంటలు) : శ్లోఎఎ శమీ శమయతే పాపం శమీశత్రు నివారిణీ ఎఅర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శినీ దేవదానవులు పాల సముద్రమును మధించినప్పుడు అమృతం జనించిన శుభ ముహూర్త



దినం ఈ విజయ దశమి రోజే అని తెలియచేయబడింది. 'శ్రవణా' నక్షత్రంతో కలిసిన ఆశ్వయుజ దశమికి "విజయ"అనే సంకేతమున్నది. అందుకనే దీనికి 'విజయ దశమి' అను పేరు వచ్చినది. ఏ పనైనా తిథి , వారము తారా బలము , గ్రహాబలము ముహూర్తము మున్నగునవి విచారించకుండా , విజయదశమి నాడు చేపట్టినచో ఆ కార్యమున విజయము తథ్యము. చతుర్వర్గ చింతామణి' అనే ఉద్గ్రంధము ఆశ్వయుజ శుక్లదశమి నాటినక్షత్రోదయ వేలనే 'విజయం ' అని తెలిపి యున్నది. ఈ పవిత్ర సమయము సకలవాంచితార్ధ సాధకమైనదని గురు వాక్యము'శమీ పూజ'చేసుకునే ఈ రోజు మరింత ముఖ్యమైనది. శమీ వృక్షమంటే 'జమ్మి చెట్టు'. అజ్ఞాతవాసమందున్న పాండవులు వారి వారి ఆయుధములను , వస్త్రములను శమీవృక్షముపై దాచి ఉంచారు అజ్ఞాతవాసము పూర్తి అవగానే ఆ వృక్ష రూపమును పూజించి ప్రార్థించి , తిరిగి ఆయుదములను , వస్త్రములను పొంది , శమీవృక్ష రూపమున ఉన్న అపరాజిత' దేవి ఆశీస్సులు పొంది కౌరవులపై విజయము సాదించారు విజయదశమి రోజు సాయంత్రం నక్షత్ర దర్శన విజయ సమయాన శమీవృక్షం (జమ్మి చెట్టు) వద్ద గల అపరాజితా దేవిని పూజించి , పై శ్లోకం పఠిస్తూచెట్టుకు ప్రదక్షణలు చేయాలి. పై శ్లోకము వ్రాసుకున్న చీటీలు ఆ చెట్టు కొమ్మలకు తగిలించాలి. ఇలా చేయుట వల్ల అమ్మవారి కృపతోపాటు , శనిదోష నివారణ కూడా జరుగుతుందని ప్రతీతి.

శమీ శమయతే పాపం శమీ శత్రు వినాశనీ , అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియవాదినీ. శమీ శమయతే పాపం శమీలోహిత కంటకా , ధారిణ్యర్జున బాణానాం రామస్య ప్రియవాదినీ. కరిష్యమాణ యాత్రాయాం యథాకాలం సుఖంమయా , తత్ర నిర్విఘ్న కర్త్రీత్వం భవ శ్రీరామపూజితే."

పాలపిట్ట దర్శనం ఎందుకు?

పాండవులు అరణ్య, అజ్ఞాత వాసాలను ముగించాక విజయదశమి రోజు శమీ వృక్షంపై ( జమ్మి చెట్టు) ఉన్న తమ ఆయుధాలను తీసుకుని హస్తినాపురం వైపు ప్రయాణానికి ఉద్యుక్తులు కాగా ఆ సమయంలో వారు ఎదురుగా వచ్చిన పాలపిట్టను చూస్తారు. అప్పటి నుండి పాండవులకు అన్నీ శుభాలే కలుగుతాయి. కురుక్షేత్ర యుద్ధంలో కౌరవులపై వారు విజయం సాధిస్తారు. అప్పటి నుండి దసరా రోజున ( విజయదశమి రోజున) పాలపిట్టను చూడడం ఆనవాయితీగా వస్తోందని పురాణాలు చెబుతున్నాయి.

# నవదుర్గా అమ్మవారునీ దర్శించుకున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్

జగిత్యాల అక్టోబర్ 11 (ప్రజా మంటలు) : పట్టణంలోని నవదుర్గా పీఠ క్షేత్రంలో దేవి శరన్నవరాత్రోత్సవాలు అంగరగ వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం మహా పూజ, మంత్ర పుష్పం, ప్రసాద వితరణ దుర్గా అష్టమి సందర్భంగా కుమారి పూజ సువాసిని పూజ , నవజ్యోతుల పూజ లింగార్చన, బలిహారణం నిర్వహించారు.శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి - అహల్య జిల్లా మాజీ తొలి జెడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ , మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. అమ్మవారి దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని కొలవడం ద్వారా సుఖసంతోషాలతో పాటు అష్టైశ్వర్యాలు లభిస్తాయన్నారు. అలాగే అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించి ఓడి బియ్యం సమర్పించారు. జిల్లా మాజీ తొలి జెడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ , మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ శత చండి హవనం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా జడ్పీ చైర్పర్సన్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిపై అమ్మవారి దయ ఉండాలని అమ్మవారి దయ ఉంటే సకల శుభాలు జరుగుతాయని, ఆ తల్లి కరుణ కటాక్షాలు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ, మాజీ జెడ్పీ చైర్పర్సన్ మున్సిపల్ చైర్ పర్సన్ కుటుంబ సభ్యులకు ట్రస్ట్ సభ్యులు అమ్మవారి చిత్రపటాన్ని అందించి సన్మానించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించి అమ్మవారిని దర్శించుకున్నారు. వేద బ్రాహ్మణుల మంత్రోత్సరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, మహిళలు, భక్తులు, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.



# 'ప్రవాసీ ప్రజావాణి' నిర్వహణకు మార్గదర్శకాలు జారీ

### స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ఉత్తర్వుల ప్రతులను విడుదల చేసిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జి.చిన్నారెడ్డి

### ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వ్యవస్థ బలోపేతం కోసం ప్రభుత్వం చర్యలు

**హైదరాబాద్, (ప్రజా మంటలు):**
హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో కొనసాగుతున్న ప్రజావాణి కార్యక్రమంలో గల్ఫ్ ఇతర గమ్యస్థాన దేశాల కార్మికులు, ఎన్నారైల కోసం ఏర్పాటు చేసిన 'ప్రవాసీ ప్రజావాణి' ఫిర్యాదుల స్వీకరణ కేంద్రం నిర్వహణకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రజావాణి ప్రతి మంగళవారం, శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్న సంగతి తెల్సిందే.

గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం సెప్టెంబర్ 16న జారీ చేసిన జీవో నెం.205 కు కొనసాగింపుగా సాధారణ పరిపాలన శాఖ లోని ప్రవాస భారతీయుల (జీఏడి – ఎన్నారై) విభాగం పక్షాన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఈనెల 9న స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపి) మార్గదర్శకాల మెమో జారీ చేశారు. 'ప్రవాసీ ప్రజావాణి' లో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి సంస్థాగతంగా ప్రామాణికరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

'ప్రవాసీ ప్రజావాణి' నిర్వహణ మార్గదర్శకాల ఉత్తర్వుల ప్రతులను శుక్రవారం ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జి. చిన్నారెడ్డి విడుదల చేశారు. టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి, దుబాయి లోని గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి అధ్యక్షులు గుండెల్లి నర్సింలు, స్వచ్ఛంద సేవకులు శాంతిప్రియ యాదవ్ (మలేసియా), బషీర్ అహ్మద్ (ఓమాన్ రిటనీ) తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'ప్రవాసీ ప్రజావాణి' నిర్వహణకు చక్కటి ఏర్పాటు చేసిన ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జి. చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యా దేవరాజన్ కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

**'ప్రవాసీ ప్రజావాణి' మార్గదర్శకాలు**
గల్ఫ్, ఇతర గమ్యస్థాన దేశాల కార్మికులు, ఎన్నారైల కోసం ఏర్పాటు చేసిన 'ప్రవాసీ ప్రజావాణి' ఫిర్యాదుల స్వీకరణ కేంద్రంలో విదేశాల్లో ఉన్న బాధితుల పక్షాన వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయవచ్చు. తదుపరి చర్యల కోసం ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపిస్తారు.




**జీఏడి – ఎన్నారై విభాగం పరిధిలో:**
గల్ఫ్ తదితర దేశాల నుంచి మృతదేహాలను ఇండియాకు తెప్పించడం, విదేశాల నుంచి వచ్చిన శవపేటికలను హైదరాబాద్ విమానాశ్రయం నుంచి స్వగ్రామం వరకు ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేయడం (దారిద్ర రేఖకు దిగువన – బీపీఎల్ వారికి), పేషేంట్లను స్వదేశానికి రవాణా చేయడం, విదేశీ జైళ్లలో ఉన్నవారికి న్యాయ సహాయం చేసి విడుదలకు కృషి చేయడం, వీసా గడువును మించి (ఓవర్ స్టే) అక్కడే నివసించడం, అత్యవసర పరిస్థితులు, క్షమాభిక్ష (ఆమ్నెస్టీ), జీతం బకాయిలు ఇప్పించడం, విదేశాలలో మన వారికి అవసరమైన అన్నిసేవలను జీఏడి – ఎన్నారై విభాగం నేరుగా పర్యవేక్షిస్తుంది. విదేశాలలోని భారత రాయబార కార్యాలయాలు, ఢిల్లీలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో అనుసంధానము చేస్తుంది. ఈ సేవలు వినియోగించుకోవడానికి తెల్ల కాగితంపై దరఖాస్తు, పాస్ పోర్ట్ మొదటి పేజీ అడ్రస్ పేజీ, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, విదేశంలోని వివరాలు, తెలంగాణలోని కుటుంబ వివరాలు మొబైల్ నెంబర్లు సమకూర్చాలి.

**ఎన్నారై మహిళా పోలీస్ విభాగం పరిధిలో:**
విదేశాల్లోని ఎన్నారై కుటుంబ వివాదాల పరిష్కారం గురించి వచ్చిన దరఖాస్తులను తదుపరి చర్యల కోసం హైదరాబాద్ లక్డీకాపూల్ లోని పోలీస్ కార్యాలయంలోని ఎన్నారై విమెన్ సెల్ కు పంపిస్తారు. ఈ సేవలు వినియోగించుకోవడానికి తెల్ల కాగితంపై దరఖాస్తు, పాస్ పోర్ట్ మొదటి పేజీ అడ్రస్ పేజీ, ఆధార్ కార్డు, మ్యారేజ్ సర్టిఫికెట్, పోలీస్ ఎఫ్ఐఆర్, విదేశంలోని వివరాలు, తెలంగాణలోని కుటుంబ వివరాలు మొబైల్ నెంబర్లు సమకూర్చాలి.

**ఏజెంట్ల మోసాలు – పోలీస్ శాఖ పరిధిలో:**
నకిలీ ఏజెంట్లు, చీటింగ్ కేసులు, విదేశాలకు సంబంధించిన ఇతర సారూప్య సమస్యలపై తదుపరి చర్యల కోసం సంబంధిత కమీషనర్ ఆఫ్ పోలీస్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కు బదిలీ చేస్తారు. ఈ సేవలు వినియోగించుకోవడానికి తెల్ల కాగితంపై దరఖాస్తు, పాస్ పోర్ట్ తదితర వివరాలు అందజేయాలి.

**గల్ఫ్ మృతులకు రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా**
రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా (మృతధన సహాయం) కోసం గల్ఫ్ దేశాలలో చనిపోయిన వ్యక్తి జీవిత భాగస్వామి (భార్య / భర్త), పిల్లలు, తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ విజ్ఞప్తిని సంబంధిత జిల్లా కలెక్టర్లకు బదిలీ చేస్తారు. నేరుగా జిల్లా కలెక్టర్లకు దరఖాస్తు చేసుకోవడం మంచిది. తెల్లకాగితంపై అభ్యర్థన లేఖ, పాస్ పోర్ట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, భారత రాయబార కార్యాలయాలు జారీ చేసిన మరణ ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలి.

**గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లు:**
గల్ఫ్ కార్మికుల పిల్లలకు ప్రభుత్వ గురుకుల పాఠశాలలలో అడ్మిషన్ల కొరకు వచ్చిన దరఖాస్తులను తదుపరి చర్యల కోసం విద్యా శాఖకు బదిలీ చేస్తారు. తెల్ల కాగితంపై దరఖాస్తు, పాస్ పోర్ట్ మొదటి పేజీ అడ్రస్ పేజీ, ఆధార్ కార్డు, విద్యార్థి సర్టిఫికెట్లు సమర్పించాలి.



# దసరా శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్

### ప్రజలకు కెసిఆర్ శుభాకాంక్షలు

**హైదరాబాద్, (ప్రజా మంటలు):**
దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. విజయానికి చిహ్నంగా దసరా పండుగను విజయదశమి పేరుతో దేశవ్యాప్తంగా జరుపుకుంటారని తెలిపారు. దసరా రోజున కుటుంబంలోని సభ్యులందరూ ఒకే చోట చేరి సామూహికంగా సంబురాలు జరుపుకోవడం తెలంగాణ సబ్బండ వర్గాల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు.శమిపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా భావించి అలాయ్ బలాయ్ తీసుకోవడం.. పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం.. శుభసూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకోవడం తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేకమని సీఎం గుర్తు చేశారు. తెలంగాణకు నిత్య విజయాలు కలిగాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలను ప్రసాదించాలని సీఎం దుర్గామాతను ప్రార్థించారు. అలాగే రాష్ట్ర ప్రజలకు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మనిషి తనలోని చెడు మీద నిత్యం పోరాటం చేస్తూ మంచి దిశగా విజయం సాధించాలనే జీవన తాత్వికతను విజయ దశమి మనకు తెలియజేస్తుందని పేర్కొన్నారు. దసరా రోజు శుభసూచకంగా పాలపిట్టను దర్శించి షమీ వృక్షానికి పూజ చేసి, జమ్మి ఆకును బంగారంలా భావించి పెద్దలకు సమర్పించుకుని వారి ఆశీర్వాదం తీసుకోవడం ఆచారం. తెలంగాణ ప్రజల జీవితాల్లో దసరా పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. అలాయ్ బలాయ్ తీసుకుని పరస్పర ప్రేమాభిమానాలను పంచుకోవడం ద్వారా దసరా పండుగ సందర్భంగా ప్రజల నడుమ సామాజిక సామరస్యం ఫరిడవిల్లుతుంది అని కేసీఆర్ తెలిపారు.

# ఏపీకి మరో తుఫాను ముప్పు

### దక్షిణ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

**అమరావతి,అక్టోబర్11 (ప్రజా మంటలు):**
ఏపీకి మరో తుఫాను ముప్పు పొంచి ఉంది. దక్షిణ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనతో రానున్న నాలుగు రోజుల్లో పలు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇది క్రమంగా అల్పపీడనంగా బలపడ నుందని వాతావరణ శాఖ హెచ్చరిక చేసింది.. అది ఈ నెల 13 నుంచి 15 మధ్య వాయు గుండంగా రూపాంతరం చెంది, ఈ నెల 17 నాటికి ఏపీ సమీపంలోనే తీరం దాటవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. అల్పపీడనం క్రమేణా బలపడి తుఫానుగా మారే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో దక్షిణ కోస్తా ? ఉత్తర తమిళనాడు మధ్య తీరం తాకవచ్చని అంచనా వేస్తున్నారు. అల్ప పీడనం ఏర్పడిన తరువాత దీని కదలిక పైన పూర్తి స్పష్టత వస్తుందని వెల్లడించారు. అల్పపీడనం తీవ్ర వాయు గుండంగా బలపడి, ఈ నెల 17 నాటికి ఏపీలోనే తీరం దాటవచ్చని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ ప్రభావంతో రానున్న నాలుగు రోజుల్లో ఏపీలోకి దక్షిణ కోస్తా ప్రాంతంలో పాటుగా ఉత్తర తమిళనాడులో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ప్రధానంగా ఏపీలోని గోదావరి జిల్లాలతో పాటుగా సీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనాగా వెల్లడించింది. అదే విధంగా ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటుగా కఅష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నెల్లూరు, వైయస్ఆర్, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లోనూ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ రోజు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కరిసే అవకాశం ఉందని వెల్లడించింది.÷ఎఫాను ప్రభావంతో రాష్ట్రంలోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఈ నెల 14 నుంచి 16 వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఇదే సమయంలో అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా బలపడింది. కర్నాటక, గోవా తీరాలకు సమీపంలో కేంద్రీకఅతమై ఉన్నట్లు ఐఎండీ వెల్లడించింది. ఇది వాయవ్య దిశగా కదులుతూ రెండు లేదా మూడు రోజుల్లో మధ్య అరేబియా సముద్రంలో వాయుగుండంగా బలపడుతుందని తెలిపింది.





# ఆదిపరాశక్తి రూపమే అమ్మవారు

### దసరా శరన్నవరాత్రుల ప్రత్యేకతే వేరు

**విజయవాడ,అక్టోబర్11 (ప్రజా మంటలు):**
అణువుల నుంచి బ్రహ్మాండాల వరకూ వ్యాపించిన విశ్వరూపిణి, విజయ వినోదిని ఆదిపరాశక్తి. ఒకరు కాదు, ఇద్దరు కాదు.. అమ్మల రూపంలో సమస్త మానవాళిని పులకింపజేయడానికి ఆ జగజ్జననియే తరలి వస్తున్న శుభవేళయే దసరా శరన్నవరాత్రులు. ఆశ్వీయుజ మాసం తొలి రోజుల్లో జరిగే ఈ రెండు వేడుకల్లోనూ కోట్లాది మందితో ఆరాధనలు అందుకొనే దైవం ఒక స్త్రీమూర్తి కావడం విశేషం. ఆమెనే సకల జగముల నేలే జగదాంబ. ప్రతీ ఒక్క మానవ మాత్రునికీ అత్యంత విశిష్ఠమని చెప్పాలి. అమ్మవారిని రోజూ నిష్టగా పుల రూపాల్లో పూజించడంతో పాటు నైవేద్యాలు సమర్పించి ఆరదాధించడం ఈ పండగ ప్రత్యేకత. వర్షఋతువు తర్వాత వచ్చే శరదృతువు అంటేనే వెన్నెల కాచే చల్లని సమయం. దేవీ నవరాత్రులను కూడా ప్రతీ హైందవ సమాజమూ అత్యంత భక్తి ప్రపత్తులతో జరుపుకుంటుంది. ఎందుకంటే, దుర్గాదేవి , అమ్మల గన్న యమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ అన్నా.. ఎవరో కాదు, ఆ ఆదిపరాశక్తే. నమ్మిన వారికి, దైవిక సిద్ధాంతాన్ని ఆచరించే వారికి ఆమె అనేక రూపాలలో దర్శనమిస్తుంది. ఈ శక్తి కూడా అనేక రూపాలలో కనిపిస్తున్నది. అనంత విశ్వం మహాశక్తిపైనే ఆధారపడి ఉంది. భారతీయ ధర్మశాస్త్రాలు ప్రతీ స్త్రీమూర్తినీ శక్తికి ప్రతీకగా అభివర్ణించాయి. ఆ మాటకొస్తే అవి నారీమణులను పూజ్యనీయుల జాబితాలోకే చేర్చాయి. త్రిమూర్తులను, త్రిమాతలను, ఇంకా మొత్తంగా దేవతల గణాన్నందరినీ సృష్టించింది ఆదిపరాశక్తియే. ఒక్కమాటలో చెప్పాలంటే, ఆమెనే యావత్ సృష్టికి కర్త కర్మ క్రియ. కాబట్టి, సర్వశక్తులకూ కేంద్రస్థానం ఈ మహాశక్తి. సృష్టికర్త, సంరక్షకురాలు, దుష్ట వినాశనకారి సర్వం ఆమెనే అని దేవీ భాగవత పురాణం పేర్కొన్నది. ఏడు సింహాలతో కూడిన రత్నాల సింహాసనంపైన ఆదిశక్తి కూర్చుని ఉండడాన్ని త్రిమూర్తులు చూసినట్లు అందులో ఉందని వేదపండితులు చెప్తారు. ఆదిబీజమే (ఆదిపరాశక్తి) తనంతట తాను పురుషుడుగా, ప్రకృతి (స్త్రీ)గా విభజితమైనట్లు అష్టాదశ పురాణాలలో ప్రధానమైన బ్రహ్మ పురాణం తెలిపింది. దేవీ భాగవతం ప్రకారం శక్తిలోని శకు ఐశ్వర్యమని, క్తికి పరాక్రమమని అర్థం చెప్పారు. సృష్టి ఆరంభంలో ఒక్క దేవి మాత్రమే ఉందని, ఆమెయే ఈ బ్రహ్మాండాల న్నింటినీ సృష్టించిందని బహ్వృచోపనిషత్‌లోనూ కనిపిస్తుంది. ఆమె నుండే త్రిమూర్తులు, సర్వమూ ఉద్భవించినట్టు కూడా అందులో ఉంది. ఎప్పుడైతే భూమిమీద దానవత్వం పెరుగుతుందో అప్పుడు తాను అవతరించి దుష్టశిక్షణ జరుపుతానని జగజ్జనని అన్నట్టు దేవీసప్తశక్తి పేర్కొంటున్నది. జగత్తులన్నింటికీ మూలమైన భగవంతుణ్ని సైతం సృష్టించింది భగవతి అయిన ఈ పరాశక్తియే. ఇంతేకాదు, ప్రతీ అణువణువులోని ప్రాణశక్తికి, ఆత్మయిక జీవుల్లో నిగూఢంగా ఉండే కుండలినీ శక్తులకూ, పరమాత్మలోని యోగ–మహామాయలకు.. అన్నింటికీ ఆదిమూలమూ ఆమెనే అని ఆధ్యాత్మిక వేత్తలు అంటారు. ఆ మహాశక్తి విశ్వరూపంలో మన దర్శనానికి అందింది అత్యల్పం. కాబట్టి, ప్రతి ఒక్కరూ అహాన్ని పక్కన పెట్టి శక్తి ఆరాధనకు సంసిద్ధులు కావాలి.శక్తి ఆరాధనను ఏదో ఒక మతానికో, వర్గానికో పరిమితం చేయనవసరం లేదు. విశ్వంలో కనిపించని శక్తులూ ఇంకా శాస్త్రవేత్తల మేధకు, విజ్ఞాన శాస్త్రాలకు అందకుండానూ ఉన్నాయి. అవన్నీ మహావిశ్వంలో భాగమే అయినప్పుడు, మానవాళికి సర్వతోముఖాభివృద్ధికి అవన్నీ ఉపయోగపడుతున్నప్పుడు వాటిని శక్తి రూపంలో ఆరాధించడంలో తప్పులేదు.

# మద్యం దరఖాస్తుల వెల్లువ

### ప్రభుత్వానికి 1600కోట్ల ఆదాయం

**అమరావతి,అక్టోబర్11 (ప్రజా మంటలు):**
ఏపీలో కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువు శుక్రవారంతో ముగిసింది. దరఖాస్తుకు శుక్రవారం చివరిరోజు కావడంతో పెద్ద ఎత్తున ఆశావహులు దరఖాస్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3,396 మద్యం దుకాణాల కోసం ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. శుక్రవారం ఒకే రోజు 20వేల వరకు దరఖాస్తులు రావచ్చని అంచనా. దాంతో ప్రభుత్వానికి రూ.1600కోట్లకుపైగానే ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు అత్యధికంగా



ఎన్టీఆర్ జిల్లాలో అత్యధికంగా, అల్లూరి జిల్లాలో అత్యల్పంగా దరఖాస్తులు వచ్చాయి. నిన్నటి వరకు ఎన్టీఆర్ జిల్లాలో 113 మద్యం దుకాణాలకు 4,839 మంది.. అల్లూరి జిల్లాలో 40 మద్యం దుకాణాలకు 869 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. అయితే, అమెరికా, యూరప్ నుంచి సైతం పలువురు మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మద్యం దుకాణాల కోసం శుక్రవారం రాత్రి 7 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ తెలిపారు. రిజిస్ట్రేషన్ అనంతరం 12 గంటలలోగా డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకు డీడీలతో ఎక్సైజ్ స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యాలయాలకు వచ్చే వారంతా తప్పనిసరిగా సాయంత్రం 7లోగా చేరుకోవాలని.. టికెట్లు అందించి.. దరఖాస్తులను స్వీకరిస్తామని.. ఆ తర్వాత వచ్చే వారికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు.

DIGITALLY PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AT 6-3-144, bRAHMAN WADA, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com